RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -343 పేజీలు - 08 వెల - 04/- మంగళవారం 11 నవంబర్ 2025

# ఢిల్లీలో భారీ పేలుళ్లు





## 9 మంది మృతి..


## 20 మందికి గాయాలు

### మెట్రో స్టేషన్ వద్ద పార్కింగ్ చేసిన కారులో పేలుడు

- బ్లాస్టింగ్ ధాటికి ఛిద్రమైన శరీరాలు
- పలు వాహనాలకు అంటుకున్న మంటలు
- ఆ ప్రాంతంలో భీతావహ దృశ్యాలు
- ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ఢిల్లీ సహా మెట్రోనగరాల్లో హై అలర్ట్
- ఎర్రకోట, చాందినీ చౌక్ దారులు మూసివేత : సీపీ

మిగతా 2లో

న్యూఢిల్లీ నవంబర్10**ఆంధ్ర ప్రగతి**
దేశ రాజధాని ఢిల్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. ఎర్రకోట సమీపంలో పార్క్ చేసిన రెండు కార్లలో వరుస పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 9 మంది మృతి చెందారు. గాయపడిన 20 మందిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యవర్గాలు తెలిపాయి. పేలుడు ధాటికి పలువురి శరీరాలు ఛిద్రమయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో భీతావహ దృశ్యాలు అక్కడివారిని కలిచివేశాయి. మరోపక్క మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ సహా మెట్రో న గరాల్లో హై అలర్ట్ ప్రకటించారు. ఎర్రకోట చాందినీ చౌక్‌దారులను మూసివేసినట్టు సీపీ వెల్లడించారు. ఢిల్లీ మెట్రోస్టేషన్ గేట్ నెంబర్-1 వద్ద వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. సాయంత్రం 6.52 గంటల సమయంలో అక్కడి రెండు కార్లలో అమర్చిన పేలుడు పదార్థాలు భారీ శబ్దాలతో పేలాయి. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం ఉలిక్కిపడింది. మిగతాది 2లో...





## ఎమ్మెల్యేల పెత్తనం పెరిగిపోతోంది

- వారు చెబితేనే పనులవుతున్నాయి: పవన్ కల్యాణ్
- సీఎం జోక్యం చేసుకుని హెచ్చరించాలి
- క్యాబినెట్ భేటీలో డిప్యూటీ సీఎం సూచన
- కూటమి ఎమ్మెల్యేలు ఎవరు తప్పుచేసినా ఇన్‌చార్జి మంత్రులు బాధ్యత తీసుకోవాలి
- వారి తప్పులు సరిదిద్దే ప్రయత్నం చేయండి
- వినకుంటే నా దృష్టికి తీసుకురండి: సీఎం
- ఎర్రచందనంపై క్షేత్రస్థాయికి వెళ్లి పవన్ బాగా చేస్తున్నారని ప్రశంస

2లో

## రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు

### క్వాంటం కంప్యూటింగ్ విధానానికి క్యాబినెట్ ఆమోదం

- కంప్యూటింగ్ విడిభాగాల సంస్థలకు కేంద్రంగా రాష్ట్రం
- విశాఖలో రహేజా సంస్థ పరిశ్రమ ఏర్పాటుకు ఆమోదం
- పలు పారిశ్రామిక సంస్థలకు భూ కేటాయింపులు
- కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి





అమరావతి, నవంబర్10**ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు. క్వాంటం కంప్యూటింగ్ విధానానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశమైంది. దాదాపు మూడున్నర గంటల పాటు సాగిన ఈ భేటీలో.. సుమారు అజెండాలోని 70 అంశాలపై చర్చించారు. అనంతరం క్యాబినెట్ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు, నిపుణులు, మిగతాది 2లో...

### తిరుమల పరకామణి చోరీ కేసు

## దర్యాప్తు ముమ్మరం చేసిన సిఐడి



తిరుమల,నవంబర్10**ఆంధ్ర ప్రగతి**: తిరుమల పరకామణి చోరీ కేసులో అక్రమాలపై సీఐడీ దర్యాప్తు ముమ్మరం చేసింది. హైకోర్టు ఆదేశాలతో సిఐడి దర్యాప్తు చేపట్టింది. ఇప్పటికే సిసి టివి ఫుటేజీని పరిశీలించింది. మిగతాది 2లో...

## దేవుడిని అడ్డంపెట్టుకుని నీచ రాజకీయాలు

### తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలో అసత్యాలు


### చంద్రబాబు, లోకేశ్ తీరు దారుణమన్న అంబటి




అమరావతి,నవంబర్10**ఆంధ్ర ప్రగతి**వైఎస్సార్‌సీపీ నేతలను వేధించడమే ఏకైక అజెండాతో చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తోందని వైకాపా నేత, మాజీమతం÷-రి అంబటి రాంబాబు మండిపడ్డారు. ఏడాదిన్నర కాలంలో అనేక నిదర్శనాలున్నాయి.సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నీచరాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయాలను , దైవాన్ని అడ్డుపెట్టుకుని ఘోరమైన తప్పిదాలు చేస్తున్న మిగతాది 2లో...

## ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూత

- అస్వస్థతతో హైదరాబాద్‌లో హఠాన్మరణం
- రచయితలు, కవులు, సాహితీవేత్తల దిగ్భ్రాంతి
- ప్రధాని మోడీ, సీఎం రేవంత్‌రెడ్డి సహా పలువురి సంతాపం




హైదరాబాద్ నవంబర్10**ఆంధ్ర ప్రగతి**
'మాయమైపోతున్నడమ్మో మనిషన్నవాడు' అంటూ ఆవేదన వ్యక్తం చేసిన కవి, 'జయజయహే తెలంగాణ%ౌ%' అంటూ రాష్ట్ర గీతాన్ని అందించిన ప్రముఖ రచయిత అందెశ్రీ (64) ఇకలేరు.

2లో

## నేడు జూబ్లీ బైపోల్

- పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, డ్రోన్లతో నిఘా
- ఈవీఎంలతో పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న సిబ్బంది




హైదరాబాద్ నవంబర్10**ఆంధ్ర ప్రగతి**
తెలంగాణ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ మంగళవారం జరగనుంది. అందుకు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. 25 రోజులుగా హొరాహొరీగా సాగిన ప్రచార పర్వం ఆదివారం సాయంత్రంతో ముగిసిన విషయం తెలిసిందే. ఈ ఉప ఎన్నికలో మొత్తం 58 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మిగతాది 2లో...

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఢిల్లీలో భారీ పేలుళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మంటలు ఎగిసిపడ్డాయి. ఆ పక్కనే ఉన్న అనేక వాహనాలు మంటలధాటికి తునాతునకలయ్యాయి. పేలుళ్లతో ఘటనాస్థలిలో ఉన్న ప్రజలు తమ ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులతో పాటు అగ్నిమాపక దళాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. ఏడు ఫైర్ ఇంజిన్లు వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో ఆఘమేఘాలపై మరిన్ని అగ్నిమాపక వాహనాలను తెప్పించారు. పేలుళ్లపై కేంద్రహోంమంత్రి అమిత్‌షా ఢిల్లీ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడారు. ఘటనాస్థలికి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ), ఫోరెన్సిక్ బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తును ముమ్మరం చేశాయి.

**క్షతగాత్రులకు వైద్యసేవలు**

పేలుళ్లలో గాయపడిన క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో వైద్య సేవలు కొనసాగుతున్నాయి. వారిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

**ఢిల్లీలో హైఅలర్ట్**

ఢిల్లీ మెట్రోస్టేషన్ వద్ద భీతావహ పరిస్థితిని చూస్తే ఇది పకడ్బందీగా జరిగిన దాడిలా కనిపిస్తోంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పరిస్థితి గందరగోళంగా మారటంతో.. ఢిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. కార్లు, ఆటోలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. సమీపంలోని షాపులు, భవనాలు ధ్వంసం అయ్యాయి. అయితే ప్రతి సోమవారం ఢిల్లీలోని పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లకు సెలవు. అందువల్ల ప్రమాదం తీవ్రత, ప్రాణ నష్టం కాస్త తగ్గిందని తెలుస్తోంది.

**హైదరాబాద్‌లో హైఅలర్ట్**

ఢిల్లీ పేలుళ్ల ఘటనతో హైదరాబాద్‌తో సహా పలు నగరాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. దీంతో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమై పాతబస్తీలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని అన్ని మతపరమైన ప్రదేశాలు, సరిహద్దు ప్రాంతాల్లోనూ భద్రత పెంచాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆ రాష్ట్ర డీజీపీ తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో గస్తీ, తనిఖీలు పెంచాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

**ఫరీదాబాద్‌లో పేలుడు తయారీ పదార్థాలు స్వాధీనం**

తాజాగా ఢిల్లీ సమీపంలోని ఫరీదాబాద్‌లో దాదాపు మూడు వేల కిలోల పేలుడు తయారీ పదార్థాలను జమ్మూకాశ్మీర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్తాన్‌తో సంప్రదింపులు జరుపుతున్న ముగ్గురు వైద్యులను అరెస్టు చేశారు. అటు గుజరాత్‌లో ముగ్గురు ఐఎస్ సానుభూతిపరులు అరెస్టైన వేళ ఈ పేలుళ్లు జరగటంతో అనుమానాలు బలపడుతున్నాయని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

**క్షతగాత్రులకు అమిత్‌షా పరామర్శ**

క్షతగాత్రులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా పరామర్శించారు. సోమవారం సాయంత్రం ఢిల్లీ గేట్‌కు సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ మార్గ్‌లో ఉన్న లోక్‌నాయక్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న అమిత్ షా క్షతగాత్రులను పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్సను పరిశీలించారు.

## ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

నిద్ర నుంచి లేవకుండానే సోమవారం ఉదయం ఆయన శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయారు. హైదరాబాద్ లాలాగూడలోని వినోభానగర్‌లోని ఇంట్లో భార్య మల్లమ్మ నిద్ర లేపే సమయానికే ఆయన అచేతనంగా ఉన్నారు. దాంతో కుటుంబ సభ్యులు అందెశ్రీని ఉదయం 5 గంటల సమయంలో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. దాంతో లాలాగూడతోపాటు యావత్ తెలంగాణ సమాజంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందెశ్రీ భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు ఉదయం 9:30 గంటల సమయంలో ఇంటికి తీసుకొచ్చి 20 నిమిషాలపాటు ఉంచారు. ఇరుకైన ఇల్లు, వీధి కూడా అత్యంత ఇరుకుగా ఉండటంతో ఆయన భౌతికకాయాన్ని లాలాపేట్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియానికి తరలించారు. సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై మృతదేహాన్ని ఉంచారు.ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఏపీ సీఎం చంద్రబాబు, సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తదితరులు అందెశ్రీ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లభాపురం జనార్థన, కె.ఆనందాచారి%ొ% అందెశ్రీ మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అందెశ్రీ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆ మేరకు మంగళవారం మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో అంత్యక్రియలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పలువురు మంత్రులు అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. పలువురు రాజకీయ నాయకులు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, అభిమానులు, స్థానికులు, బంధుమిత్రులు అందెశ్రీ మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలంగాణ సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన పలువురు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## మీడియా రిలేషన్స్ పోర్టల్ ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కొలుసు పార్థసారధి.

**-2026-2027 రెండేళ్ళ కాలానికి అక్రిడిటేషన్లు జారీ**

**-మీడియా సంస్థల నుండి ధరఖాస్తులు ఆహ్వానం.**

**ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబరు 10:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు 2026-2027 రెండేళ్ళ కాలపరిమితితో కూడిన అక్రిడిటేషన్లు జారీ చేసేందుకు సంబంధించి మీడియా రిలేషన్స్ పోర్టల్(వెబ్ సైట్)ను సోమవారం సమాచార పౌర సంబంధాలు,గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి లాంచనంగా



ప్రారంభించారు. ఈమేరకు ఎపి సచివాలయం ప్రచార విభాగంలో జరిగిన మీడియా సమావేశంలో మీడియా రిలేషన్స్ వెబ్ సైట్ ను సమాచారశాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాథన్ తోకలిసి ప్రారంభించారు.గతంలో జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ఈనెల 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో రానున్న 2026-2027 రెండేళ్ల కాలానికి నూతన అక్రిడిటేషన్లు జారీకి వివిధ మీడియా సంస్థల్లో పనిచేసే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల నుండి ధరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతోంది.రాష్ట్ర మరియు జిల్లాస్థాయి అక్రిడిటేషన్లకై అర్హులైన మీడియా ప్రతినిధులు అందరూ ఈపోర్టల్ లో ధరఖాస్తు చేసుకోవచ్చును.ఈపోర్టల్ లో ధరఖాస్తు చేసుకున్న జర్నలిస్ట్ లు తమ అప్లికేషన్ స్టేటస్ ఏ దశలో ఉందో కూడా ఈవెబ్ సైట్ ద్వారా తెల్సుకోవచ్చును.ఈపోర్టల్ లో ఏవిధంగా ధరఖాస్తు చేసుకోవాలనే విధి విధానాలను మంగళవారం ప్రత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుంది.

# ఎమ్మెల్యేల పెత్తనం పెరిగిపోతోంది

## – పవన్ కల్యాణ్

అమరావతి, నవంబర్10**ఆంధ్ర ప్రగతి** 'కూటమి ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలని పదే పదే చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. చాలా చోట్ల ఎమ్మెల్యేలు చెబితేనే పనులవుతున్నాయి. దీనిని సరిదిద్దుకోకపోతే మనం చెప్పే గవర్నెన్స్‌కు.. ప్రజాపాలనకు అర్థం మారిపోతుంది' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని, పార్టీలతో సంబంధం లేకుండా.. కూటమి ఎమ్మెల్యేలను గట్టిగా హెచ్చరించాలని కోరారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల పనితీరుపై వాడీవేడి చర్చ జరిగినట్లు సమాచారం. రెవెన్యూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం సూచించినప్పుడు.. భూవివాదాల విషయంలో కొందరు ఎమ్మెల్యేలు వేలు పెడుతున్నారని పవన్ కల్యాణ్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలందరినీ ముఖ్యమంత్రి గట్టిగా హెచ్చరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎర్రచందనం అక్రమ రవాణా, ఆక్రమణలు కూడా చాలా తీవ్రమైన అంశమని, ఆయన ఆక్రమణలను స్వయంగా వీడియో తీశానని, త్వరలోనే విడుదల చేస్తానని తెలిపారు. సీఎం మాట్లాడుతూ.. కూటమి ఎమ్మెల్యేలు ఎవరైనా తప్పు చేస్తుంటే ఇన్‌చార్జి మంత్రులు బాధ్యత తీసుకుని చక్కదిద్దాలని సూచించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ఎజెండాగా వారు పనిచేయాలని కోరారు. అనంతపురంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో భిన్నంగా ముందుకెళ్లామని ఆర్థిక మంత్రి పయ్యావుల క్యాబినెట్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్, ఆర్డీవోలు, ఇతర రెవెన్యూ అధికారులందరినీ కూర్చోబెట్టి 22ఏ లాంటి సుమారు 400 సమస్యలను పరిష్కరించామని ఆయన చెప్పగా.. ఇలాంటివాటిని ఆదర్శంగా తీసుకుని మంత్రులందరూ పనిచేయాలని సీఎం సూచించారు. ఎర్రచందనం విషయంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పవన్ కల్యాణ్ బాగా చేస్తున్నారని అభినందించారు.

పేదలందరికీ ఇళ్లు కల్పించే విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని సీఎం కోరారు. నివాస స్థలం లేని వారందరి జాబితా రూపొందించి అందరికీ ఇళ్ల స్థలాలు దక్కేలా చూడాలన్నారు. ఏడాదిలోగా నివాస స్థలం లేని వారికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వ చర్యలు ఉండాలన్నారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు కూడా బాధ్యత తీసుకునేలా ఇన్‌చార్జి మంత్రులు చొరవ చూపాలని సూచించారు.

విశాఖ భాగస్వామ్య సదస్సు ద్వారా యువతకు మనం ఏం చేస్తున్నామో తెలియాలని చంద్రబాబు అన్నారు. 'రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ఎంత కష్టపడుతున్నాం.. ఎన్ని ఉద్యోగాలు వస్తాయనేది హైస్కూల్ స్థాయి పిల్లలకూ తెలియాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. యువత భవిష్యత్‌కు మనమేం చేస్తున్నామో వారికి తెలియాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు.

జనసేన కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాలివ్వాలని మంత్రి కందుల దుర్గేశ్ కోరగా.. అది పాలసీ మేటర్ అని ఆ పార్టీకే చెందిన మరో మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీఎం స్పందిస్తూ.. పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవలసిందేనన్నారు. సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్నా.. అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు కట్టేందుకు తనకు 45 ఏళ్లు పట్టిందని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ వాళ్లను అభినందించాలన్నారు. అన్ని జిల్లాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

మొంథా తుఫాన్ సమయంలో బాగా పనిచేశారని మంత్రులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉండి.. బాధితులకు తక్షణ సాయం అందేలా చూశారని.. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే సహాయ చర్యలు వేగంగా అందాయని తెలిపారు. ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూ.. టెక్నాలజీ సాయంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. మంత్రులు, అధికారులు టీమ్ స్పిరిట్‌తో పనిచేస్తే ఇటువంటి మంచి ఫలితాలే వస్తాయని చెప్పారు. జిల్లాస్థాయిలో సమీక్ష సమావేశాలు కచ్చితంగా నిర్వహించాలని ఇన్‌చార్జి మంత్రులకు స్పష్టంచేశారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్ నిర్వహించాలని.. ప్రతి మంత్రీ నెలకోసారి పార్టీ కార్యాలయానికి రావాలని సీఎం సూచించారు.

# రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు

(మొదటి పేజీ తరువాయి)

క్వాంటం కంప్యూటింగ్ విడిభాగాల సంస్థలకు ఏపీ కేంద్రంగా మారు తోందన్నారు. ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించడమే క్వాంటమ్ కంప్యూటింగ్ మిషన్ లక్ష్యమన్నారు. 5 వేల మంది నిపుణులు, స్టార్టప్‌లు రాష్ట్రానికి వస్తాయని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా విశాఖలో రహేజా సంస్థ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.విశాఖ జిల్లా కాపులుప్పాడలో పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం ఇచ్చింది. తిరుపతి, ఓర్వకల్లులో పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం ఇచ్చారు. డెడికేటెడ్ డ్రోన్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు ఓర్వకల్లులో 50 ఎకరాల కేటాయింపు చేశారు. నెల్లూరులో ఫైబర్ సిమెంట్ ప్లాంటు కోసం బిర్లా గ్రూప్‌నకు భూమి కేటాయింపునకు కేబినేట్ ఆమోదించింది.ఓర్వకల్లులో సిగాచి ఇండస్ట్రియల్ లిమిటెడ్ సింథటిక్ ఆర్గానిక్ ప్లాంట్‌కు 100 ఎకరాల కేటాయింపు చేశారు.అనకాపల్లి జిల్లాలో డోస్కో ఇండియా లిమిటెడ్‌కు 150 ఎకరాల కేటాయింపునకు అనుమతి ఇచ్చింది. కృష్ణా జిల్లా బాపులపాడులో 40 ఎకరాల్లో వేద ఇన్నోవేషన్ పార్కు ఏర్పాటు కానుంది. అనంతపురంలో టీఎంటీ బార్ ప్లాంట్‌కు 300 ఎకరాలకుపైగా కేటాయింపునకు ఆమోదం దక్కింది. రాష్ట్రంలో డిజిటల్ అనుసంధాన స్పేర్ వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు ఆమోదం ఇచ్చారు. ప్రతి మండలంలో 20-30 వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేసేవారికి ప్రభుత్వ ఆర్థిక సాయం అందించనుంది. విశాఖలో ఐటీ సంస్థల ఏర్పాటు ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చింది. విశాఖలో రియాల్టీ లిమిటెడ్ ఐటీ పార్కు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.

# నేడు జూబ్లీ బైపోల్

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకోసం ఎన్నికల సంఘం 407 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసింది. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. యూసఫ్‌గూడలోని డీఆర్‌సీ సెంటర్‌లో ఈసీ అధికారులు సిబ్బందికి ఈవీఎంలను, పోలింగ్ స్టేషన్లను కేటాయించారు. ఈవీఏంలు, ఎన్నిక మెటీరియల్ తీసుకుని ఎన్నికల సిబ్బంది సోమవారం సాయంత్రం పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి ఆర్‌వి.కర్ణన్ పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న ఉప ఎన్నిక నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ మరింత అప్రమత్తమైంది. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలతో నిఘా పెట్టారు. డ్రోన్ల ద్వారా సెక్యూరిటీ మానిటరింగ్ చేయనున్నారు. పోలింగ్ ఏజెంట్‌కు, సిబ్బందికి ప్రత్యేక పాస్‌ను కేటాయించారు. పోలింగ్ నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని వైన్స్, పబ్బులు మూసేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లకు, కాలేజీలకు, కార్యాలయాలకు సెలవు ప్రకటించారు.

**సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా**

పోలింగ్ సందర్భంగా ఎలాంటి అంవాఛనీయ ఘటనలూ జరగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. 2060 మంది ఎన్నికల సిబ్బందితోపాటు 2000మంది పోలీస్ సిబ్బందితో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే 144 సెక్షన్ ఆంక్షలు విధించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలో 139 సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. నేడు పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాన్ని వెల్లడిస్తారు.

## తిరుమల పరకామణి చోరీ కేసు

# దర్యాప్తు ముమ్మరం చేసిన సిఐడి

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా తిరుపతి పద్మావతి అతిథి గృహంలో అధికారుల విచారణ కొనసాగుతోంది. గతంలో తిరుమల వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో పని చేసిన పోలీసులు ఎస్సై లక్ష్మీరెడ్డి, సీఐ జగన్‌మోహన్ రెడ్డి విచారణకు హాజరయ్యారు. పరకామణి చోరీ సమయంలో తితిదే వీజీవోగా పనిచేసిన గిరిధర్ కూడా విచారణకు వచ్చారు. తిరుమల పరకామణిలో రవికుమార్ అనే వ్యక్తి ఓ మఠం తరఫున పనిచేసేవాడు. ఏళ్లతరబడి గుమస్తాగా ఉంటూ.. విదేశీ కరెన్సీని లెక్కించేవాడు. చాలాకాలంగా విదేశీ కరెన్సీని పక్కదోవ పట్టించారనే ఆరోపణలు అతనిపై ఉన్నాయి. వైకాపా హయాంలో 2023 ఏప్రిల్ 29న విదేశీ కరెన్సీని లెక్కిస్తూ.. అందులో కొన్ని నోట్లను పంచెలో ప్రత్యేకంగా కుట్టించుకున్న అరల్లో దాచుకున్నాడు. అతని కదలికలపై అనుమానం వచ్చి సిబ్బంది తనిఖీ చేయగా పట్టుబడ్డాడు. దీనిపై అప్పటి ఏవీఎస్వో సతీష్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో రవికుమార్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆరోజు అతడు 900 డాలర్లు అపహరించగా, అప్పట్లో వాటి విలువ రూ.72 వేలుగా తేల్చారు. అసలు దొరికింది 112 నోట్లని, రికార్డుల్లో తొమ్మిది నోట్లే చూపించారనే ఆరోపణలు వచ్చాయి. ఇలా చాలాకాలంగా పరకామణిలో చేతివాటం చూపించి కాజేసిన సొమ్ముతో రవికుమార్ రూ.కోట్లకు పడగలెత్తాడని ఆరోపణలున్నాయి. ఇది తెలుసుకున్న వైకాపాలోని కొందరు పెద్దలు లోక్‌అదాలత్‌లో కేసును రాజీ చేయించి, అతడి ఆస్తులను కొట్టేసినట్లు చెబుతున్నారు.

# దేవుడిని అడ్డంపెట్టుకుని నీచ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబును ఆ దేవుడు కూడా క్షమించడని అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీపై నిందలు వేయడానికి తన ఎల్లో మీడియాను వాడుకుంటారు. వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష తీర్చుకునేందుకు ముందుగా కొన్ని కథనాలను రాయిస్తారు. ఏదో జరిగిపోతుందనే భావన ప్రజలకు కలిగేలా చేస్తారు. ఆ తర్వాత ఏదో పెద్ద నేరం చేసేశారని నమ్మించడానికి దర్యాప్తు కోసం సిట్‌ను ఏర్పాటు చేస్తారు.చంద్రబాబు మోచేతి నీళ్లు తాగే ఐపీఎస్ అధికారులతో సిట్ వేసి విచారణ చేయిస్తారు. ఎవరో ఒకరిని తీసుకొచ్చి బలవంతంగా వారితో వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు చెప్పిస్తారు. బెదిరించి వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు చెప్పిస్తారు.లేదంటే భౌతికంగా దాడి చేసి చెప్పిస్తారు. బలవంతంగా పేర్లు చెప్పించడం .. వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు పెట్టడమే చంద్రబాబు ప్రభుత్వం పని. దేవుడిని సైతం తన స్వార్థ రాజకీయాలకు వాడుకునే నీచమైన స్థితికి చంద్రబాబు దిగజారిపోయారు. చంద్రబాబు రాజకీయ కక్షలకు తిరుపతి వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని అడ్డుపెట్టుకుంటున్నారు. టిటిడిని అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ, వైఎస్ జగన్‌పై బురదజల్లుతున్నారు. పరమ పవిత్రమైన తిరుపతి లడ్డూని కల్తీ అయ్యిందని చంద్రబాబు దుర్మార్గంగా ప్రచారం చేశారు. జగన్‌పై బురద చల్లడానికే చంద్రబాబు ఇలాంటి తప్పుడు ప్రచారం చేశారు. పవిత్రమైన లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందంటూ అసత్య ప్రచారం చేశారు.సీబీఐ విచారణ జరిపించాలని మాజీ టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.కోర్టు సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ద్వారా విచారణ చేయించాలని చెప్పింది. దేవుడిని సైతం రాజకీయాలకు వాడుకోవద్దని చంద్రబాబుకు చురకలు అంటించింది. కోర్టుకు వెళ్లినందుకు వైవీ సుబ్బారెడ్డిపై కక్ష తీర్చుకునేందుకు వరుస కథనాలు రాయించారు. చిన్న అప్పన్న అనే వ్యక్తిని జూన్ 6వ తేదీన సిట్ విచారించింది. వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు చెప్పాలని చిన్న అప్పన్నపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. ఏపీలో ఏదైనా పెద్ద ఇష్యూ జరగగానే లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తెస్తారు.నెయ్యిలో కల్తీ ఉందని ఇంత వరకూ నిరూపించలేకపోయారు. లడ్డూ ప్రసాదాన్ని ఇప్పటి వరకూ ఎక్కడికీ టెస్టుకు పంపించనే లేదు. కానీ లడ్డూ కల్తీ అయిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. చిన్న అప్పన్న 2018 వరకూ వైవి.సుబ్బారెడ్డి వద్ద పీఏగా పనిచేశారు. అంతకంటే ముందు వేమిరెడ్డి ప్రతాప్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి వద్ద కూడా పనిచేశారు. చంద్రబాబు టా÷-గ్గ÷ట్ వైవీ సుబ్బారెడ్డి కాబట్టి వేరే నేతల పేర్లు బయటికి రావు. ఇప్పటి మంత్రి పార్థసారథి గతంలో టీటీడీ పర్చేజింగ్ కమిటీలో ఉన్నారు. వైవీ సుబ్బారెడ్డి వైఎస్సార్‌సీపీ నేత కాబట్టి ఆయన్ని టా÷-గ్గ÷ట్ చేశారు.2014-19 మధ్య చంద్రబాబు హయాంలో నెయ్యి ఖరీదు 276 రూపాయలు మాత్రమే. ఏదో ఒక విధంగా దైవాన్ని అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ, జగన్‌పై బురదజల్లడమే చంద్రబాబు పని. మా పార్టీ నుంచి ప్రజలను దూరం చేయాలన్నదే చంద్రబాబు, లోకేష్ ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబు,లోకేష్ చేస్తున్నది చాలా నీచమైన రాజకీయం అని విమర్శలు గుప్పించారు. దేవాలయాలను, దైవాన్ని అడ్డుపెట్టుకుని ఘోరమైన తప్పిదాలు చేస్తున్న చంద్రబాబును దేవుడు కూడా క్షమించడు. ఎవరిపై కక్ష తీర్చుకుందాం..ఎవరిని లోపల వేద్దామనేదే చంద్రబాబు ఆలోచన .చంద్రబాబు,లోకేష్ వైఎస్సార్‌సీపీపై కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని హితువు పలికారు.

# విజయవంతమైన ఉభయ తెలుగు రాష్ట్రాల యూరాలజీ సదస్సు.

**8,9 తేదీలలో రెండు రోజులపాటు నంద్యాలలో నిర్వహణ.-25 మంది జాతీయస్థాయి యూరాలజీ నిపుణులు ప్రసంగించారు.**

**300 మంది యూరాలజీ వైద్యులు ప్రతినిధులుగా పాల్గొన్నారు : డాక్టర్ భార్గవ్ వర్ధన్ రెడ్డి, నిర్వాహక కార్యదర్శి.**



ప్రసంగిస్తున్న ఢిల్లీ సఫ్దర్ జంగ్ హాస్పిటల్ యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అనూప్ కుమార్.



సదస్సులో ప్రసంగిస్తున్న బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సమీర్ త్రివేది



డాక్టర్ చంద్రమోహన్

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 10:**
ఉభయ తెలుగు రాష్ట్రాల యూరాలజీ వైద్య సంఘం ( సొసైటీ ఆఫ్ జెనిటో యూరినరీ సర్జన్స్) ఆధ్వర్యంలో నంద్యాల,కర్నూలు జిల్లాల యూరాలజీ సంఘాల సంయుక్త నిర్వహణలో గత శని, ఆదివారాలలో నంద్యాలలో జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల రాష్ట్రస్థాయి యూరాలజీ వైద్య వైజ్ఞానిక సదస్సు విజయవంతమైందని సోమవారం సదస్సు నిర్వాహక కమిటీ కార్యదర్శి డాక్టర్ భార్గవ్ వర్ధన్ రెడ్డి, నిర్వాహక కమిటీ కోశాధికారి డాక్టర్ జై బాబు రెడ్డి, కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి డాక్టర్ దాసరి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో 25 మంది జాతీయస్థాయిలో పేరుగాంచిన యూరాలజీ వైద్యనిపుణులు జననేంద్రియ, మూత్ర పిండాలు,మూత్రాశయం,మూత్ర నాళాలు, ప్రొస్టేట్ వ్యాధుల చికిత్సలో వచ్చిన అధునాతన మార్పులు, వినియోగంలోకి వచ్చిన అత్యంత ఆధునిక పరికరాలపై మల్టీమీడియా ప్రజెంటేషన్ ద్వారా యూరాలజీ వైద్యులకు అవగాహన కల్పించారని తెలిపారు. చికిత్స విధానాలపై విభిన్న అభిప్రాయాలు ఉన్న కొన్ని వ్యాధులపై చర్చ పోస్టులు నిర్వహించారు. యూరాలజీ పి.జీ.విద్యార్థులు క్లిష్టమైన వ్యాధులకు చికిత్స విధానాలపై తమ పరిశోధన పత్రాలు సమర్పించారు.ఢిల్లీ కి చెందిన సఫ్ధర్ జంగ్ హాస్పిటల్ యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అనూప్ కుమార్, వారణాసిలో ఉన్న బెనారస్ హిందూ యూనివర్సిటీ యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సమీర్ త్రివేది, హైదరాబాద్ కు చెందిన దక్షిణ భారత యూరాలజీ వైద్యుల సంఘం కార్యదర్శి డాక్టర్ చంద్రమోహన్ వంటి ప్రముఖ నిపుణులు సదస్సులో పాల్గొనడం విశేషమని అన్నారు.

300 మంది ఉభయ తెలుగు రాష్ట్రాల కు చెందిన యూరాలజీ వైద్యులు ప్రతినిధులుగా సదస్సులో పాల్గొన్నారని తెలిపారు. ప్రతినిధులుగా పాల్గొన్నవారికి ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ తరపున నిరంతర వైద్య విద్య నాలుగు పాయింట్ల సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి వైద్యుడు ఐదు సంవత్సరాలకు ఒకసారి తమ వైద్య రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించుకునే సమయంలో మొత్తం 25 నిరంతర వైద్య విద్య పాయింట్లు కలిగి ఉండాలని వివరించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ తరపున పరిశీలకులుగా శాంతిరాం వైద్య కళాశాల రేడియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఈ.పనిల్ కుమార్ సదస్సుకు హాజరయ్యారు. సూపర్ స్పెషాలిటీ విభాగానికి చెందిన రాష్ట్రస్థాయి సదస్సు నంద్యాలలో నిర్వహించడం ఇదే మొట్టమొదటిసారి అని తెలిపారు.
యూరాలజీ వైద్య విభాగానికి సంబంధించిన చికిత్సలన్ని ప్రస్తుతం నంద్యాలలో అందుబాటులో ఉన్నాయని, నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే చికిత్సలు చేయడానికి అవసరమైన అత్యంత ఆధునిక పరికరాలు, వసతులు ఉన్నాయని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ


డాక్టర్ భార్గవ్ వర్ధన్ రెడ్డి.

ద్వారా కూడా అనేక యూరాలజీ చికిత్సలు పేద ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వివరించారు.
నంద్యాలలో ఇంత పెద్ద వైజ్ఞానిక వైద్య సదస్సు నిర్వహించినందుకు నిర్వాహక కమిటీకి రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ లు అభినందనలు తెలిపారు.

## నంద్యాల ఐఎంఏ అకడమిక్ విభాగం నూతన కార్యవర్గం ఎన్నిక.

**అధ్యక్షులుగా డాక్టర్ మల్లీశ్వరి. కార్యదర్శిగా డాక్టర్ లలిత. కోశాధికారిగా డాక్టర్ శశికిరణ**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 09:**
ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ కు అనుబంధంగా ఉన్న అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ నంద్యాల శాఖకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా డాక్టర్ మల్లీశ్వరి, కార్యదర్శిగా డాక్టర్ జి. లలిత కుమారి, కోశాధికారిగా డాక్టర్ శశికిరణ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ హిందూమతి,డాక్టర్ భారతి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ గెలివి సిద్ధార్థ, డాక్టర్ మణిదీప్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ పాండురంగారావు, డాక్టర్. ఎం.శ్రీనివాసులు,డాక్టర్ నాగరాజా రెడ్డి ,డాక్టర్ మహబూబ్ బాషా, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఎన్నుకోబడ్డారు. ఈ విభాగానికి,నంద్యాల ఐఎంఏ కు కోఆర్డినేటర్ గా డాక్టర్ సుసుమ వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా నూతన


అధ్యక్షులు డాక్టర్ మల్లీశ్వరి.


కార్యదర్శి డాక్టర్ లలిత.


కోశాధికారి డాక్టర్.శశి కిరణ్.

అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ నంద్యాల శాఖ కార్యవర్గానికి ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి,డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ లక్ష్మీ సౌజన్య,డాక్టర్ వసుధ, డాక్టర్ హరిత అభినందనలు తెలిపారు. అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ నంద్యాల శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డ డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ లలిత కుమారి మాట్లాడుతూ వైద్యులకు నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు నిర్వహించి, వివిధ స్పెషాలిటీ విభాగాలలో వస్తున్న ఆధునిక వైద్య విధానాలు,నూతన పరికరాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.తద్వారా వైద్యులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి దోహదపడుతుందన్నారు.

# నందివర్గం, బనగానపల్లె పోలీసు స్టేషన్ లు ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ.

**సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యక నిఘా ఉంచండి. - శాంతిభద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచెయ్యండి.**

**రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యక చర్యలు తీసుకునేలా దిశ నిర్ధేశం. - జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.**








ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ నవంబర్ 10: సోమవారం నాడు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ డోన్ సబ్ డివిజన్ పరిధిలోని నందివర్గం మరియు బనగానపల్లె పోలీస్ స్టేషన్ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ పరిసరాలు ,లాకప్ గదులు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.
అనంతరం స్టేషన్ రికార్డులు, జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ఐటి కాసులు, సి సి టి ఎన్ ఎస్ పనితీరు మరియు పెండింగ్ కేసుల వివరాలు మొదలగు రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు అప్ డేట్ చేసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ల పరిధిలోని గ్రామాలు మరియు గ్రామాలలో పరిస్థితులపై మరియు స్టేషన్ ఆవరణలో వివిధ కేసులలో పట్టుబడిన వాహన వివరాలు కేసుల స్థితిగతులపై ఆరా తీశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలు మరియు మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశిస్తూ సైబర్ క్రైమ్ నేరాల నియంత్రణకు గ్రామాలలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యక నిఘా ఉంచి అక్కడ ఎలాంటి అల్లర్లు,గొడవలు జరుగకుండా ప్రత్యక శ్రేద్ధ తీసుకోవాలి. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.
ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి ఫిర్యాదిదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి,క్షుణ్ణంగా విచారించి నిర్దిష్ట సమయంలో చట్ట పరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. పాత నేరస్థులు, నేర చరిత్రగల వారు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి విధులు ,వృత్తి పరమైన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## పాణ్యం ప్రభుత్వజూనియర్ కళాశాల లో తల్లికి వందనము అమౌంట్ విద్యార్థుల కు పడలేదు.





**ఆంధ్ర ప్రగతి పాణ్యం నవంబర్ 10:** పాణ్యంమండలం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లికి వందనం పథకానికి సంబంధించిన డబ్బులు ఒక జూనియర్ కళాశాలలో 50మంది విద్యార్థులకు అందలేదు అని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు పాణ్యం మండలంలో పాణ్యం మండలంలో వందల సంఖ్యలో విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీలలో తప్పుగా ఉండడం వలన విద్యార్థులు అధికారుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేదు. ఈ విషయంపై ఎన్ఎస్ఐ జిల్లా కార్యదర్శి బత్తిని ప్రతాప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు విద్యార్థులవిద్యార్థుల వారి తల్లిదండ్రులు అకౌంట్లలోవందలాదికిఇంకా పడలేదు పేదమధ్య తరగతి వారి కుటుంబాలు విద్యార్థులకు ఫీజులు కట్టలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై సోమవారం నాడు పాణ్యం మండలం డిప్యూటీ తాసిల్దార్, శివ శంకర్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు పాణ్యంలో ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఆధార్ క్యాంపుఏర్పాటు చెయాలి, తల్లికి వందనం,అమౌంట్ పడని విద్యార్థులతల్లిదండ్రులు అమౌంట్లోతొందరగా వేయాలని కూటమి ప్రభుత్వన్ని కోరుతున్నాంఈ కార్యక్రమం లోమండలం నాయకుడు వేణు,ముజేమిళ్, పరమేష్,సురేంద్ర, కిరణ్, విశ్వనాథ్, తదితరులుపాల్గొన్నారు.

# ఎంపికైన కానిస్టేబుళ్ల శిక్షణను తక్షణమే ప్రారంభించాలి.

**6,100 యువత భవిష్యత్తు కాపాడండి.**

**నంద్యాల జిల్లా ప్రజా సమస్యల పరిస్కార వేదికలో డిఆర్ఓ రాంనాయక్ కు వినతిపత్రం.**

**ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాముడు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 10:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖలో 2022 నవంబరులో విడుదలైన కానిస్టేబుల్ పోస్టుల నోటిఫికేషన్ ప్రకారం, ప్రిలిమ్స్, ఫిజికల్ టెస్టులు, మెయిన్స్ మరియు మెడికల్ పరీక్షల వంటి అన్ని దశలు పూర్తయ్యాయి.సుమారు 6,100 మంది యువత ఈ నియామక ప్రక్రియలో విజయవంతమై, పోలీస్ శాఖలో శిక్షణ ప్రారంభం కావాలనే ఆశతో నెలలుగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ నియామక ప్రక్రియ ప్రారంభమై నాలుగేళ్లు గడిచినా ఇప్పటికీ శిక్షణ తరగతులు ప్రారంభం కాలేదు.దీనివల్ల వేలాది మంది యువకుల భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. యువకులు మరియు వారి కుటుంబాలు మానసిక, ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారు.అందుచేత అఖిల భారత యువజన సమాఖ్య ఆంధ్రప్రదేశ్ నంద్యాల జిల్లా సమితి అభ్యర్థులు తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని క్రింది అంశాలపై దృష్టి సారించమని %AIYF% జిల్లా సమితిగా అధికార యంత్రాంగాన్ని కోరుతున్నాం.రాష్ట్ర పోలీస్ శాఖలో ఎంపికైన 6,100 మంది కానిస్టేబుళ్ల శిక్షణ షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని,శిక్షణ కార్యక్రమాలను తక్షణమే ప్రారంభించి, నియామక ప్రక్రియను పూర్తిచేయాలని,ఈ నియామక ప్రక్రియలో జరిగిన అనవసర ఆలస్యాలకు బాధ్యత వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ నియామక ప్రక్రియలకు స్పష్టమైన సమయపట్టిక రూపొందించి కచ్చితంగా అమలు చేయాలని కోరుతూ నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిస్కార వేదికలో డిఆర్ఓ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరామడు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు మధు, పామూలేటి, శేఖర్ లు పాల్గొన్నారు.

## ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 10:**
కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు కార్మికులు, ఉద్యోగులు ఐక్యం కావాలి.



ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం కొనసాగుతుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పింది తడవుగా కార్మికుల శ్రమను దోచుకునేందుకు, నరేంద్ర మోడీ మెప్పు కోసం 10 గంటల పని విధానాన్ని నేటి నుండి అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం సరైనది కాదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు నాగరాజు,జిల్లా ఉపాధ్యక్షులు తోటమద్దులు, కల్లా. మహమ్మద్ గౌస్, జిల్లా కార్యదర్శులు దర్శనం.లక్ష్మణ్, వెన్న. బాల వెంకట్ లు అన్నారు స్థానిక సిఐటియు కార్యాలయంలో వారు మాట్లాడుతూ రోజుకు 24 గంటల పాటు ఉంటే ఎనిమిది గంటలు పని చేయాలి ఎనిమిది గంటలు కుటుంబం అవసరాల కోసం వినియోగించుకోవాలి 8 గంటల పాటు నిద్ర పోవాలి అప్పుడే మనిషి ఆరోగ్యకరంగా ఉండి అన్ని రకాల పనులు చేయగలరని అలా కాకుండా ఎనిమిది గంటల పని విధానం కొనసాగించకుండా 10 గంటల పాటు పనులు చేయాలని చెప్పడం అంటే పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు కార్మికుల శ్రమను దోచుకోండని తలుపులు తీయడమే అని దీనివలన కార్మికులు పనులు చేయలేక కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవడంలో వెనుకబడే అవకాశం ఉందని అన్నారు కార్మికుల,ఉద్యోగుల శ్రమను దోచుకున్న ప్రభుత్వాలు గతంలో కూలిపోయాయని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం లక్షలాది మంది కార్మికుల ప్రాణాలు అర్పించి పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని తుంగలో తొక్కడం అంటే తన గొయ్యిని తనే తవ్వుకుని భూస్థాపితం అయ్యే అవకాశం ఉందని, కార్మికులను,ఉద్యోగులను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని చంద్రబాబు నాయకత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వం రోబోలాగా చూడడం సరైనది కాదని, ఇప్పటికైనా కళ్ళు తెరవకపోతే కార్మికులంతా, ఉద్యోగులంతా కలిసి కూటమి ప్రభుత్వాన్ని సమాధి చేస్తారని హెచ్చరించారు.

## నిబద్ధతతో పనిచేసి పోలీసు శాఖకు మంచిపేరు తీసుకొనిరావాలి.

**హెూంగార్డు గా నియామకపత్రాలను అందించిన.....జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ నవంబర్ 10:**నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ యూనిట్ ఖజాపీర్ మరియు నంద్యాల యూనిట్ లలో జాఫర్ వలి హెూంగార్డ్ గా విధులు నిర్వహిస్తు అనారోగ్య కారణాలవల్ల హాస్పిటల్ లో చికిత్స పొందుతు మరణించడం జరిగింది.వారి కుటుంబ సభ్యులకు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదు అనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నుండి వారికి రావసిన బెన్ఫిట్స్ అందించడం జరిగింది. అనంతరం నేడు ఖజాపీర్ భార్య జహీర్ బీకి మరియు జాఫర్ వలి భార్య తయాబా బేగమ్ కు హెూంగార్డ్ గా నియమిస్తు ఉత్తర్వులు జారీ చెయ్యడం జరిగింది.ఈ సందర్భంగా నేడు జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ చేతుల మీదుగా నంద్యాల జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయం నందు హెూంగార్డ్ గా నియమించిన ధృవపత్రాన్ని అందించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో అలసత్వం వహించకుండా నిబద్ధతతో పనిచేయాలని, పోలీస్ శాఖకు మీ యూనిట్ కి మంచి పేరు తీసుకురావాలని, మీకు ఏ సహాయం కావాలన్నా పోలీస్ డిపార్ట్మెంట్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ మంజునాథ్ పాల్గొన్నారు.

# తెలుగు భాషకు అపూర్వమైన సేవ చేసిన సి. పి. బ్రౌన్. చిరస్మరణీయం.

**ఎస్పీ సునీల్ సునీల్ షోరాణ్.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ నవంబర్ 10:** నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు సి.పి బ్రౌన్ (చార్లెస్ ఫిలిప్ బ్రౌన్) జన్మదిన వేడుకలను జిల్లా ఎస్పీ సునీల్ సునీల్ షోరాణ్ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్పీ గారు సి.పి బ్రౌన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సి. పి. బ్రౌన్ (చార్లెస్ ఫిలిప్ బ్రౌన్) సి. పి. బ్రౌన్ 1798 నవంబర్10న కలకత్తాలో జన్మించాడు. తరువాత 1817లో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరి, 1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టరుగా కూడా పనిచేశారు. తెలుగు ప్రాంతానికి వచ్చిన తరువాత, ఆయనకు తెలుగు భాషపై ఎంతో ప్రేమ పెరిగింది. ఆ సమయానికి చాలా తెలుగు పుస్తకాలు, కవితలు, కథలు పూర్తిగా నాశనం కావడానికి దగ్గరగా ఉన్నాయి. అవి కనుమరుగై పోతాయని గ్రహించిన సిపి బ్రౌన్ ఇంటి ఇంటికి వెళ్లి, గ్రామ గ్రామానికి వెళ్లి, పాత పుస్తకాలను సేకరించారు. వాటిని సవరించి మళ్ళీ ముద్రించి, మన భాషను భవిష్యత్తుకు సురక్షితం చేశారు. ఆయన తయారు చేసిన తెలుగు ఇంగ్లీష్ డిక్షనరీ ఇవాళ కూడా తెలుగు నిఘంటువుల్లో అత్యంత ప్రామాణికమైనది. అలాగే ఆయన వేమన శతకాలు, కవి తిక్కన, నన్నయ్య మరియు అనేక తెలుగు సాహిత్య కృతులను రక్షించి ప్రసిద్ధం చేశారు. ఒక ఇంగ్లీష్ వ్యక్తి, తనకు చెందినది కాని భాష కోసం ఇంత ప్రేమ, ఇంత సేవ చేయడం నిజంగా గొప్ప విషయం. అందుకే ఆయనను మనం గర్వంగా "తెలుగు భాషా రక్షకుడు" అని పిలుస్తాము. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఏన్. యుగంధర్ బాబు ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ కె ఎస్ ఎస్ శ్రీనివాసరావు, మరియు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో ఘనంగా శివపార్వతుల కళ్యాణం.

**కార్తీక మాసం సందర్భంగా లోక కళ్యాణం కోసం నిర్వహణ.**

**-ఐఎంఏ నంద్యాల అన్ని మతాల పర్వదినాలు నిర్వహించడం ఆనవాయితీ: డాక్టర్ రవి కృష్ణ.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 10:** పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని నంద్యాల ఐ ఎం ఏ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆర్ద్ర నక్షత్రంలో స్థానిక సంజీవనగర్ రామాలయం లో శివపార్వతుల కళ్యాణం, అభిషేక పూజలు నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్ నిర్వహణలో, ప్రముఖ సిద్ధాంతి కార్తికేయ శర్మ పౌరోహిత్యంలో కల్యాణోత్సవం మూడు గంటలపాటు ఘనంగా నిర్వహించారు. కార్తికేయ శర్మ కార్తీక మాసంలో శివపార్వతుల కళ్యాణ విశిష్టతను వివరించారు. కళ్యాణోత్సవం, అభిషేక పూజలలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, సతీమణి సునంద, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ ఈశ్వరి, మాజీ ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ అనిల్ కుమార్ , డాక్టర్ హరిత, నంద్యాల ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ లలిత,డాక్టర్ నెరవాటి వినోద్ కుమార్, డాక్టర్ అరుణ కుమారి,డాక్టర్ పెసల అశోక్ కుమార్, డాక్టర్ సునీత, డాక్టర్ పాండురంగారావు, డాక్టర్ శైలజ, డాక్టర్ నిరంజన్ రెడ్డి దంపతులు కంకణ ధారణ చేసి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో అన్ని మతాల పర్వదినాలను ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని, ఐక్య భావన కోసం, లోక కళ్యాణం కాంక్షించి శివపార్వతుల కళ్యాణం నిర్వహించామని తెలిపారు. డాక్టర్ సహదేవుడు,డాక్టర్ జఫరుల్లా పురాణ, ఇతిహాసాల లో ఉన్న కార్తీక మాస విశేషాలను శ్లోకాలతో వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ,సునంద దంపతులను శాలువా, పూల మాలతో ఐఎంఏ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమాలలో భగవత్ సేవా సమాజ్ అధ్యక్షులు సూరయ్య,డాక్టర్ సహదేవుడు, డాక్టర్ రవికాంత్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ నెట్ల మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ జఫరుల్లా,డాక్టర్ షబ్నం తదితరులు పాల్గొన్నారు.

# నాపరాయి గనుల పరిశ్రమ రాయల్టీ పై మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి వైఖరి బయటపెట్టాలి.

**పరిష్కరించకపోతే రహదారుల దిబ్బంధం -ఎన్ రంగనాయుడు సిపిఐ జిల్లా కార్యదర్శి**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 10:** నంద్యాల సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగ నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు. అనంతపురం. కడప జిల్లాలలో నల్ల బండల గనులు ఎక్కువగా ఉన్నాయి రాయల్టీ ప్రైవేట్పురం చేయడంతో ఒక టన్ను నాప రాయి సరఫరా కి 2250 రూపాయలు చెల్లించాలని హైదరాబాద్కు చెందిన సుధాకర్ ప్రైవేట్ లిమిటెడ్ కి చెందిన వాళ్లు టెండర్ వేసి ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. దీంతో ఈ జిల్లాల పరిశ్రమలు గనుల మీద అధిక భారం పడుతుందని అన్నారు.

పెరిగిన ఇంధన ధరలు కరెంటు చార్జీలు దినసరి కూలి రేట్ల వలన కొలిమిగుండ్ల ఆవుకు మండలాలలో నాపరాయిని అమ్ముకోలేక గిట్టు బాటు ధర లేక నాపరాయి గనులు మూసివేసి ప్రత్యామ్నాయ%శీ%గా వేరే పనులు చూసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ రాయల్టీలను ప్రైవేటుపరం చేయడం వల్ల దినసరి కూలీలుగా లోడింగ్. అన్లోడింగ్ అమాలీలుగా నాపరాయి ఫ్యాక్టరీల్లో పాలిష్




కార్మికులుగా లారీ. ట్రాక్టర్ డ్రైవర్లుగా విధులు నిర్వహించుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న పేద. మధ్యతరగతి వర్గాలు అధిక శాతం నష్టపోయారు అని అన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ.. నంద్యాల పట్టణంలో నెలకొన్న సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలను నిర్వహిస్తామని అన్నారు. పట్టణములోని 42 వార్డులలో ప్రజలు దోమలతో వీధి కుక్కలతో అంటు రోగాల బారిన పడి అల్లాడుతుంటే మున్సిపల్ అధికారులు వారి ముక్కు పిండి పన్నులు చెల్లించుకుంటారు కానీ వారి సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలం కావడం జరుగుతుంది. 130 ఏళ్ల చరిత్ర గల మున్సిపాలిటీ అవినీతికి నిలయంగా మారింది. మున్సిపాలిటీలో ఉద్యోగి కాదు పబ్బతి వేణు అనే ఒక కాంట్రాక్టు మున్సిపాలిటీ నీ శాసించే స్థాయికి ఎదిగాడు ఆయన ఏమి చెబితే అది మున్సిపల్ అధికారులు అమలు చేసే స్థాయికి దిగజారారు.

పట్టణములో వడ్డీ వ్యాపారుల ఆగడాలు స్తుతిమించాయి పది రూపాయల వడ్డీతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలు పట్టణములో అనేకమంది ఉన్నారు. ఇలా అనేక సమస్యలు తాండవిస్తున్నాయి. ఈ సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను విచారణ జరిపి చట్ట పరిదిలో న్యాయం చేస్తాం.!

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ నవంబర్ 10:** నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఫిర్యాదిదారుల నుంచి 111 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి. 1)నా కుమార్తెకు నందికొట్కూరు ప్రభుత్వ హాస్పిటల్ లో అటెండర్ ఉద్యోగం ఇప్పిస్తానని పగడం. చంద్రశేఖర్ మరియు దుద్యాల .అన్వర్ లు 03 లక్షల రూపాయలు డబ్బులు తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేశారని నందికొట్కూర్ టౌన్ కు చెందిన పర్వతం శేషన్న జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

2). ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్ చర్చి పాస్టర్ సమూయేలు మా ఊరి వారి వద్ద నుండి నేనుతెచిన 15 లక్షల రూపాయలను అప్పుగా తీసుకొని 10 లక్షల రూపాయలకు బాండ్ రాసి 5 లక్షల రూపాయలకు తరువాత రాసి ఇస్తానని నమ్మించి మోసం చేశాడని నాకు న్యాయం చేయండని శ్రీపతిరావు పేట గ్రామానికి చెందిన తిరుపతయ్య జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు. 3). నాకు బేతంచెర్ల గ్రామం నందు 82 సెంట్ల పొలం కలదు సదరు పొలం కు వెళ్లకుండా రామచంద్రారెడ్డి సన్నాఫ్ శంకర్ రెడ్డి దారిని కబ్జా చేసి గోడ కట్టుచున్నారు. దారి లేకపోవడం వలన పొలం బీడు పెట్టే పరిస్థితి ఏర్పడుతుంది కావున మా పై దయవుంచి నాకు న్యాయం చేయండని బేతంచెర్ల గ్రామానికి చెందిన ముర్తుజాబి జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేశారు.

# రీఓపెన్ దరఖాస్తులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించండి.

**అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను మెరుగుపరచాలి.**

**పెండింగ్ ఆడిట్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**పిజిఆర్ఎస్ లో స్వీకరించిన దరఖాస్తులు 192.**

**ఎకలెక్టర్ రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 10:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రీఓపెన్ అయిన దరఖాస్తులను నాణ్యతతో వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సమయానుకూల చర్యలు తీసుకోవాలని, అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌లను స్పష్టంగా, నాణ్యంగా రూపొందించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి డిసెంబర్‌లో జిల్లా కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నందున, రెవెన్యూ మరియు ఇతర శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకు 580 రీఓపెన్ దరఖాస్తులు నమోదు కాగా, వాటిలో ఎక్కువ శాతం బండి ఆత్మకూరు, పాణ్యం, నంద్యాల, కొత్తపల్లి, రుద్రవరం, డోన్, గడివేముల, బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయాలు మరియు ఆత్మకూరు, నంద్యాల ఆర్డీఓ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్నాయని వీటన్నింటినీ వారం రోజుల్లో క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంకా 56 అర్జీలు సంబంధిత తాసిల్దారులు తమ లాగిన్ లో చూసుకోలేదని... ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. అలాగే విఐపి గ్రీవెన్స్‌లను అత్యంత ప్రాధాన్యంతో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కే పి ఐ) కు సంబంధించిన డేటా అప్లోడ్‌లో ఆలస్యం లేకుండా చూడాలన్నారు. అలాగే మొబైల్ టవర్ల భూసేకరణ పెండింగ్ కేసులు, అలాగే ఈ-క్రాప్ సూపర్ చెక్‌లో పెండింగ్‌లో ఉన్న పొలాలను జియో ట్యాగింగ్ ద్వారా పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. బండి ఆత్మకూరు మండలం, ఈర్నపాడు గ్రామ అర్జీదారు ఎస్. రామయ్య సర్వే నంబర్ 230-1బిలో ఉన్న 2 ఎకరాలు 4 సెంట్ల



భూమి తన పేరున ఆన్లైన్‌లో నమోదు చేయాలని, పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జూపాడుబంగ్లా మండలం, పారుమంచాల గ్రామ అర్జీదారు టి. అజయ్‌కుమార్ సర్వే నంబర్ 145లో ఉన్న భూమిని ఇతరులు అక్రమంగా ఆక్రమించి, వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో తమ పేర్లు నమోదు చేసుకున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బేతంచెర్ల మండలం, మద్రికుంట గ్రామ అర్జీదారు ఎం. సూర్యుడు సర్వే నంబర్ 166-1లో ఉన్న భూమిలో కేవలం 1.25 సెంట్లు మాత్రమే ఆన్లైన్‌లో నమోదు కాగా, మిగిలిన భూమి ఆన్లైన్ రికార్డుల్లో లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సదరు భూమిని ఆన్లైన్‌లో నమోదు చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 192 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు సమర్పించారు. స్వీకరించిన అర్జీలన్నింటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# పట్టణ పేద మహిళల డిజిటల్ సాధికారతకు డిజిలక్ష్మి పథకం.

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 10:** రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన డిజి%-%లక్ష్మి పథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పేద మహిళలకు, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు డిజిటల్ సాధికారత మరియు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబడుతున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ అనంతరం డిజి లక్ష్మీ పథకంపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రతి పట్టణ స్థానిక సంస్థ పరిధిలో సాధారణ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయబడతాయని, వీటిని అర్హత కలిగిన స్వయం సహాయక సంఘాల మహిళలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా మహిళలు తమ నివాస ప్రాంతాల నుంచే ప్రభుత్వ డిజిటల్ సేవలను ప్రజలకు అందించడం ద్వారా ఉపాధి పొందగలుగుతారు. డిజి-లక్ష్మి పథకం మహిళల ఆర్థిక స్వావలంబనకు మరియు డిజిటల్ సాధికారతకు నూతన మార్గం చూపుతుందన్నారు. ఈ పథకం ద్వారా మహిళలు డిజిటల్ సేవల సరఫరాదారులుగా మారి తమ కుటుంబాలకు ఆదాయ వనరులు సృష్టించుకుంటారని తెలిపారు. నంద్యాల జిల్లాలో మొత్తం ఆరు మునిసిపాలిటీలలో 9,710 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వాటిలో 83,294 మంది మహిళా సభ్యులు ఉన్నారని వివరించారు. ఈ పథకం కింద ప్రతి 250 పేద కుటుంబాలకు ఒక కియోస్క్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారని తెలిపారు. జిల్లాలోని 324 స్లం లెవెల్ సమాఖ్యల్లో డిజి%-%లక్ష్మి కియోస్క్ సెంటర్లు ఏర్పాటు చేయబడి, 324 మంది మహిళలు డిజి%-%లక్ష్మిలుగా ఎంపికవుతారని కలెక్టర్ పేర్కొన్నారూ. ఈ కేంద్రాల స్థాపనకు అవసరమైన కంప్యూటర్, ప్రింటర్, స్కానర్ మరియు ఇతర పరికరాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా 2.50 లక్షల వరకు రుణం అందించబడుతుందని తెలిపారు. ఈ కేంద్రాలు "మీ సేవా కేంద్రాల" మాదిరిగా పనిచేస్తూ, అందించే సేవలకు అనుగుణంగా డిజి%-%లక్ష్మిలకు కమిషన్ లభిస్తుందని వివరించారు. ఈ పథకం ప్రధానంగా డిజిటల్ సాధికారత, ఆర్థిక స్వాతంత్ర్యం, స్వయం ఉపాధి, మరియు ప్రభుత్వ సేవలను ప్రజల దరిదాపుల్లోకి తేవడం వంటి నాలుగు ప్రధాన లక్ష్యాలను సాధించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నదని తెలిపారు. పట్టణ పేద మహిళలు ఈ పథకం ద్వారా డిజిటల్ ప్రపంచంలో భాగస్వాములై తమ జీవిత ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు. డిజి%-%లక్ష్మి పథకం సమర్థవంతంగా అమలు కావడానికి సంబంధిత శాఖాధికారులు, పట్టణాభివృద్ధి సంస్థలు మరియు మహిళా సంఘాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు మెప్మా పిడి వెంకట దాసు పథకం గురించి వివరించారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో జిల్లాను టాప్ ఫైవ్ లో ఉంచండి.

**డేటా ఆధారిత పాలనపై ప్రత్యేక దృష్టి పెట్టండి.**

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 10:** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలన్నింటిలోనూ నంద్యాల జిల్లాను టాప్ ఫైవ్ జిల్లాలలో ఉంచేందుకు అన్ని శాఖలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో అధికారులతో సమీక్షించారు. డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలన్నింటిలోనూ నంద్యాల జిల్లాను టాప్ ఫైవ్ జిల్లాలలో ఉంచేందుకు జిల్లా అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాల అమలులో డేటా ఆధారిత పాలన కీలక పాత్ర పోషిస్తుందని అందుకు అనుగుణంగా ప్రతి శాఖాధికారి తమ పనితీరును మెరుగు పరచుకొని మరింత చురుకుగా పనిచేయాలని



సూచించారు. ఈనెల 6వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన డేటా ఆధారిత పాలనపై వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా పాల్గొనని కొంతమంది అధికారుల పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం 20 ముఖ్య అంశాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించిందని తెలిపారు. అధికారులు తమ దృక్పథాన్ని మార్చుకుని పనిదిశను మెరుగుపరచుకోవడంతో పాటు సిబ్బందిని సమర్థంగా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి కార్యాలయ పనితీరును పరిశీలించేందుకు ట్రాకింగ్ వ్యవస్థను జిల్లా స్థాయిలో అమలు చేస్తామని ఆమె తెలిపారు. తదుపరి రోజుల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు పనితీరు ఆధారంగా ర్యాంకింగ్ విధానం అమలు చేయనున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 513 కీలక పనితీరు సూచికల్లో (కెపిఎల్ఎస్) 449 అనుకూల సూచికలు, 64 ప్రతికూల సూచికలు ఉన్నాయని, వాటి ఆధారంగా ప్రతి శాఖ ప్రగతిని పర్యవేక్షిస్తామని ఆమె వివరించారు. ప్రతి నెల మండల స్థాయిలో 5వ తేదీలోగా, జిల్లా స్థాయిలో 8వ తేదీలోగా సంబంధిత శాఖలు డేటాను నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలన్నారు. ప్రతి ఫోరంలో, ప్రతి వేదికలో శాఖ ప్రగతిని ప్రజలకు వివరించే అలవాటు కలిగి ఉండాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి 24 గంటల పాటు పనిచేసేందుకు సిద్ధంగా వుండాలని ఆమె పేర్కొన్నారు. డేటా ఆధారిత పాలన ఇప్పుడు అత్యంత కీలకమైన పరిపాలనా మార్గదర్శకంగా మారిందని, ప్రజలకు సత్వరమైన, సమర్థమైన సేవలు అందించడమే అధికారుల ప్రధాన లక్ష్యం కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 11 నవంబర్ 2025

## జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఆధ్వర్యంలో టీ-ఐసీఆర్‌పీ శిక్షణ ప్రారంభం.: డిపిఎం శ్రీనివాసులు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 10:** జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కార్యక్రమం కింద, ఆర్‌వైయస్‌యస్‌ఏపిసిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో టీఐసీఆర్‌పీలకు (బ్యాచ్02) ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం నంద్యాల జిల్లాలో ప్రారంభమైంది. ఈ శిక్షణలో నందికొట్కూరు, కోయిలకుంట్ల, డోన్ డివిజన్‌ల నుండి 63 మంది పాల్గొంటున్నారు. బ్యాచ్02 శిక్షణ నవంబర్ 10 నుండి 14 వరకు కొనసాగనుంది. శిక్షణ కార్యక్రమం మొదటి రోజున ప్రాజెక్టు లక్ష్యాలు, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, మరియు టీఐసీఆర్‌పీల బాధ్యతలపై సెషన్లు నిర్వహించారు. రాబోయే రోజుల్లో ప్రకృతి వ్యవసాయ 9 సూత్రాలు, ఏగ్రేడ్ మరియు ఏటీఎం మోడల్స్, పీఎమ్‌డీఎస్/ఆర్డీఎస్, కిచెన్ గార్డెన్ వంటి అంశాలపై క్లాస్‌రూమ్ టీచింగ్‌తో పాటు ప్రాక్టికల్ సెషన్లు కూడా నిర్వహించబడతాయి. శిక్షణలో భాగంగా క్షేత్ర స్థాయిలో మోడల్స్ అమలు, లీడ్ ఫార్మర్ల ఎంపిక, రైతులతో మోడల్స్ వేయించడం, మరియు ఐసీఆర్‌పీల మార్గదర్శక చర్యల ప్రణాళిక రూపొందించబడనుంది. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డిపిఎం) శ్రీనివాసులు గారు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా టీఐసీఆర్‌పీలు గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ మోడల్స్ అమలు చేసి, రైతుల మార్పుకు ప్రధాన కారకులుగా నిలుస్తారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణకు నైపుణ్యం కలిగిన క్యాడర్‌ను తయారు చేయడమే మాలక్ష్యమన్నారు. ఎస్‌హెచ్‌జీలు, వివోలు, ఎమ్ఎస్‌లు వంటి వేదికలను ఉపయోగించి గ్రామస్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేసి, రైతులకు సంఘాల ద్వారా ఆర్థిక వనరులు అందేటట్లు చర్యలు తీసుకోవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడిపిఎం, జిల్లా ఎన్ఎఫ్ఏలు సునంద, రామకృష్ణ, నరేంద్ర, కరీం భాష, డిటిటిలు, టీఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

## పిఆర్ వన్ యాప్ లో ట్యాంకుల పరిశుభ్రత, క్లోరినేషన్ వివరాలను పొందుపరచండి.

### -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 10:** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరం చేసి పిఆర్ వన్ యాప్ లో ట్యాంకుల పరిశుభ్రత మరియు క్లోరినేషన్ వివరాలను ఎప్పటికప్పుడు పూర్తి స్థాయిలో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపిడిఓ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంచాయతీ రాజ్ కార్యకలాపాలు, గ్రామ సచివాలయ సేవల అమలు స్థితిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డిపిఓ లలితా బాయి, డిఎల్డిఓ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ప్రతి ట్యాంక్ శుభ్రత వివరాలు పరిశుభ్రత అనంతరం 15 రోజులకు ఒకసారి "పిఆర్ వన్ యాప్"లో అప్లోడ్ చేయడంతో పాటు క్లోరినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, దాని వివరాలను సమయానుకూలంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే స్వామిత్వ పథకం ఫేజ్%-%2 లో పెండింగ్‌లో ఉన్న గ్రామాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వచ్ఛంద్ర కార్యక్రమం కింద ఈ శనివారం వ్యక్తిగత పరిశుభ్రత మరియు ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాల్సి ఉందని, ఈ కార్యక్రమం ద్వారా బహిరంగ మలమూత్ర విసర్జన నిరోధంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పబ్లిక్ టాయిలెట్స్ అందరికీ సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి అని సూచించారు. అలాగే ప్రతి పాఠశాలలో వ్యక్తిగత పరిశుభ్రత మరియు ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి అని తెలిపారు. వాట్సాప్ గవర్నర్స్ సహాయంతో డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న వారందరి వివరాలను అప్లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు. కౌశలం పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను, ముఖ్యంగా నంద్యాల, ఆత్మకూరు ప్రాంతాలకు సంబంధించిన వివరాలను పూర్తి చేయాలని సూచించారు. అలాగే సిటిజన్ ఈ%-%కెవైసీ, చిల్డ్రన్ విథౌట్ ఆధార్, మైగ్రేట్ ఇన్ ఏపి వంటి పెండింగ్ డేటాను సమగ్రంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీని ప్రతి నెల 1వ తేదీ నాటికి తప్పనిసరిగా పూర్తి చేయాలని, అలాగే పంపిణీ అనంతరం పెండింగ్ మొత్తాలను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పంచాయతీ రాజ్ విభాగం మరియు గ్రామ సచివాలయాల సమన్వయంతో ప్రజా సేవలను అందించడం ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిద్దాం.

### ఈనెల 12వ తేది ప్రజాఉద్యమంలో పాల్గొని విజయవంతం చేద్దాం.



**ఆంధ్రప్రగతి నంద్యాల నవంబర్ 10:** నంద్యాల మండలం గోస్పాడు మండలం కార్యకర్తలతో ఈనెల 12వ తేదీ జరగబోవు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం కార్యక్రమం విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి వైఎస్ఆర్సిపి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, ఎమ్మెల్సీ ఇషాక్ భాష, మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ పి పి నాగిరెడ్డి, వైఎస్ఆర్సిపి స్టేట్ సెక్రటరీ పిపి మధుసూదన్ రెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్ఆర్సిపి రైతు విభాగం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, వైఎస్ఆర్సిపి గోస్పాడు మండల అధ్యక్షుడు పి పి రాజశేఖర్ రెడ్డి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్ వైఎస్ఆర్సిపి నంద్యాల మండలం అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా సెక్రెటరీ శివనాగిరెడ్డి వైసీపీ నాయకులు వంశీధర్ రెడ్డి రామచంద్రారెడ్డి వైసిపి కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు తీసుకున్న దుర్మార్గపు నిర్ణయాన్ని వ్యతిరేకించేందుకు ఈనెల 12వ తేది ఉదయం 9గంటలకు నంద్యాల పట్టణం ఉదయానంద రెసిడెన్సి నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు చేపట్టనున్న ప్రజా ఉద్యమం నిరసన ర్యాలీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శిల్పా కుటుంబ అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని దశాబ్దాల కలను నిజం చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నెరవేర్చేందుకు చేపట్టిన గొప్ప కార్యక్రమాన్ని అడ్డుకొనేందుకు కూటమి నేతలు ప్రయత్నం చేస్తున్నారని పీపీపీ విధానం ద్వార మెడికల్ కళాశాలను నిర్వహించాలనే దుర్మార్గపు ఆలోచనను వెనక్కి తీసుకోవాలని మన పిల్లల, భవిషత్ తరాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మనమందరం నడుం భిగించాలని ప్రజావ్యతిరేక విధానాన్ని వ్యతిరేకించాలన్నారు.

# ఆర్జీఎం లో భారీ స్థాయి ప్రాంగణ ఎంపికలు.

### - మొట్టమొదటిసారి రాయలసీమ పరిధిలోని విద్యార్థినిలకు ప్రాంగణ ఎంపికలు.

### -ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో పాల్గొన్న ఐదు జిల్లాల విద్యార్థినీలు.







**ఆంధ్ర ప్రగతి పాణ్యం,నవంబరు10:** మండలంలోని ఆర్ జి ఎం ఇంజనీరింగ్ కళాశాలలో మొట్టమొదటిసారిగా భారీ స్థాయిలో ప్రాంగణ ఎంపికలు నిర్వహన సోమవారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికలో రాయలసీమలోని ఉమ్మడి కర్నూలు, కడప, రాజంపేట, సత్యసాయి, అనంతపురం జిల్లాల నుండి 5000 మంది విద్యార్థినిలు ఈ ప్రాంగణ ఎంపికలో పాల్గొన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగే ఈ ఎంపికలో నాలుగవ సంవత్సరం చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థినీలు పాల్గొంటున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. ఇందులో పాల్గొన్న విద్యార్థినీలకు మౌఖిక రాత పరీక్షలు,ఇంటర్వ్యూలు, నిర్వహించి ఎంపికైన విద్యార్థినీలకు వార్షిక వేతనం కింద రూ. 3.6 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధి హర్ష దీప్ పత్ర ఎంపికలో పాల్గొన్న విద్యార్థినీల భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేశారు. విద్యార్థినీలు తమ లక్ష్య సాధనలో ముందుండాలని కోరారు. విద్యార్థినిలకు కళాశాల ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ అధికారి డాక్టర్ సుధీర్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.






## రైల్వే స్టేషన్ నాగులకట్ట వద్ద వైభవంగా కార్తీకమాస వనభోజన మహోత్సవం..!

### -దాదాపు రెండు వేల మంది భక్తులకు ప్రసాదం పంపిణీ.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 10:** నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ నాగులకట్ట వద్ద కార్తీక మాసం మూడవ సోమవారం రోజున బొగ్గరపు నారాయణ వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు మరియు అభిషేక పూజలు, అర్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. నంద్యాల రైల్వే స్టేషన్ కు నూనెపల్లి నుంచి వచ్చే రహదారి పక్కన ఉన్న వినాయక గుడి, నాగుల కట్ట శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్యం స్వామి, పరమేశ్వరుడు, శ్రీ వెంకటేశ్వరస్వామి, సాయిబాబా, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి, శ్రీ రాఘవేంద్ర స్వామి, నవగ్రహ చిన్న మండపాలు పూర్వం నుంచి ఏర్పాటు చేసుకొని మూలసాగరం, నూనెపల్లి, సాయిబాబా నగర్, ఎంఎస్ నగర్, తదితర కాలనీల భక్తులు పూజలు చేసూకుంటూ తమ మొక్కుబడులు తీర్చుకీంటున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు నారాయణ, వారి మిత్ర బృందం ఈ సామూహిక చిరు ఆలయాల్లో ప్రతి పండుగ ఘనంగా జరుపుకొని అటు వెళ్లే బాటసారులకు అన్న ప్రసాద వితరణ చేస్తూ వస్తున్నారు. కార్తీక మాసం పురస్కరించుకొని గత కొన్ని సంవత్సరాలుగా ప్రత్యేకంగా విచ్చేసిన భక్తాదులందరికి మరియు కాలనీల భక్తులకు ప్రతి సోమవారం కార్తీకమాస వనభోజన మహోత్సవం కార్యక్రమాలను దాతల సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా తల్లిదండ్రులు ఇంతకు పూర్వం ఇక్కడ స్వామివారి పూజా కైంకర్యాలు నిర్వహించే వారని అనంతరం నాకు ఆస్తిగా ఈ నాగుల కట్ట స్వామి వార్లకు పూజ చేసుకొనే అవకాశాన్ని బాధ్యతగా ఇచ్చారని ఈ సందర్భంగా తెలిపారు. నేను ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తు నాకు వచ్చిన వేతనంలో సగం వేతనం దేవుని పూజ కైంకర్యాలకు అభివృద్ధికి వినియోగిస్తున్నానని అది నాకు ఎంతో తృప్తిని, సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు. రైల్వే అధికారులు ఇంతకు ముందు పర్వదినాల్లో వంట చేసుకొనే వెసులుబాటు ఇచ్చి సహకరించేవారని, ఇప్పుడు ఆలయాలపై ఉన్న రేకులు తొలగించి, వంట చేసుకోవడానికి కూడా అనుమతి నిరాకరించడంతో



రోడ్డుపై చేయాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ఎంతో బాధేసిందని, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా దేవస్థానం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించామని ఇందులో రైల్వే సిబ్బందే ఎక్కువమంది ఉన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తొలగించిన రేకుల షెడ్ వెంటనే వేయాలనీ, పూర్వం నుంచి ఉన్న ఆలయాలు అలాగే యధావిధిగా ఉండేలా రైల్వే అధికారులు చూడాలని విజ్ఞప్తి చేశారు.

# ఏపీ సగర (ఉప్పర) వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఉప్పరి సురేష్ కుమార్.

### డైరెక్టర్ ఉప్పరి సురేష్ కుమార్ కు టిడిపి కార్యాలయంలో ఘన సన్మానం.

### బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్న టిడిపి శ్రేణులు.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 10:** ఆంధ్రప్రదేశ్ సగర (ఉప్పర) వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నంద్యాల 8వ వార్డుకు చెందిన ఉప్పరి సురేష్ కుమార్ నియమితులైన శుభ సందర్భంగా, నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి. ఫిరోజ్ హాజరయ్యారు. అనంతరం కొత్తగా డైరెక్టర్‌గా నియమితులైన ఉప్పరి సురేష్ కుమార్ ని శాలువాతో సన్మానించి అభినందించారు.

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. సురేష్ కుమార్ నియామకం సగర (ఉప్పర) వర్గానికి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని, ఆయన ఈ పదవి ద్వారా తమ వర్గం సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీ ఎల్లప్పుడూ వెనుకబడిన వర్గాలకు అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు.

డైరెక్టర్ ఉప్పరి సురేష్ కుమార్ ఈ సందర్భంగా పార్టీ పెద్దలకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ కు, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారికి, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ గారికి, కృతజ్ఞతలు తెలియజేస్తూ, తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, సగర వర్గం అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు.

ఈ సన్మాన కార్యక్రమంలో సుబ్రి , షేక్ మొహమ్మద్ రఫీ (మున్నా) , నాగేశ్వరరావు , ఎబినేజర్ , కృపాకర్ , బింగుమల్లె శ్యాంసుందర్ గుప్తా , జోసెఫ్ , మరాఠీ సూరి , అక్బర్ , శ్రీనివాసులు , ప్రదీప్ రెడ్డి , డాక్టర్ గురు ప్రసాద్ , చిలకల చెన్నయ్య , హరుణ్ బేగ్ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు సగర సంఘం ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# బీహార్‌లో రాహుల్ ఓట్ చోరీ పనిచేసేనా?

నవంబర్10**ఆంధ్ర ప్రగతి**
బీహార్ ఎన్నికలు ఓ రకంగా బిజెపికన్నా రాహుల్‌కే ప్రతిష్టాత్మకంగా భావించాలి. ఓట్ చోరీ పేరుతో మన ఎన్నికల వ్యవస్థను అప్రతిష్టపాలు చేసిన వ్యక్తిగా రాహుల్ చరిత్రలో నిలిచపోయారు. ఆయన మోడీ పాలన పై చేస్తున్న విమర్శలను సహేతుకంగా తీసుకోవచ్చు. కానీ ఓట్ చోరీ పేరుతో వ్యవస్థను బద్నాం చేస్తూ వచ్చారు. ఆయన అమెరికా వెళ్లి వచ్చినప్పుడల్లా ఏదో అంశం మీద రచ్చచేస్తూనే ఉన్నారు. పంజాబ్‌లో రైతులను రెచ్చగొడుతూనే వచ్చారు. అధికార లేమితో కాంగ్రెస్ నానాయాగీ చేస్తోందని చెప్పుకోవచ్చు. అలాగే తమ యూపిఏ పాలనలో అక్రమాలపై నోరు మెదపడం లేదు. బీహార్‌లో కాంగ్రెస్ ఎన్నటికీ విజయం సాధించే అవకాశం లేదు. బీహార్‌లో తొలిద ముగిసింది. రెండోదశ మంగళవారం ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ క్రమంలో తమదే అధికారం అని చెబుతున్న రాహుల్, ఓడిపోతే ఓట్‌చోరీతో మరింత యాగీ చేయాలన్న బలమైన వ్యూహంతో ఉన్నారు. ఇకపోతే ఇప్పటికే 9సార్లు సిఎంగా గెలిచిన నితీశ్ కుమార్‌కు ఓ రకంగా ఇవి చివరి ఎన్నికలని భావించాలి. గెలిస్తే పదోసారి సిఎంగా ప్రమాణం చేస్తారా లేదా అన్నది చూడాలి. 2020 అసెంబ్లీ ఎన్నికలలో జనతాదళ్ ఓట్ల వాటా 15 శాతంగా ఉన్నది. నితీశ్ మళ్లీ అధికారానికి రావడానికి ఇది విశేషంగా తోడ్పడింది. 2005 నుంచి ప్రతి ఎన్నికల్లోను రెండు వర్గాలు నితీశ్‌కు పూర్తి మద్దతునిస్తున్నాయి. మహిళలు, బాగా వెనుకబడిన కులాలవారు నితీశ్‌కు మద్దతునిస్తున్నారు. మహిళా ఓటర్ల శక్తిని జాతీయ రాజకీయ పక్షాలు కనుగొనక ముందే నితీశ్‌కుమార్ మహిళా ఓటర్ల ఆదరాభిమానాలను బాగా చూరగొన్నారు. మృదుభాషిగా పేరున్న నితీశ్ తన ప్రత్యర్థిగా మారిన స్నేహితుడు, పల్లెటూరి మనిషిలా వ్యవహరించే లాలూప్రసాద్‌కు పూర్తిగా భిన్నమైన వ్యక్తి. ఈ కారణంగానే మహిళా ఓటర్లను నితీశ్ ఆకట్టుకున్నారు. అచంచలమైన కుల సంబంధిత విధేయతలతో పాటు మహిళా ఓటర్ల మద్దతు నితీశ్ విజయాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. 2005లో నితీశ్ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చదువుకుంటున్న బాలికలు అందరికీ ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఆనాడు లబ్ది పొందిన బాలికలు ఇప్పుడు వయోజన ఓటర్లుగా ఉన్నారు. ఆ మహిళా ఓటర్లే నితీశ్ నాయకత్వానికి, అధికార ప్రాభవానికి వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పకతప్పదు. ఈ కారణంగానే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నితీశ్‌ను ఎన్‌డిఎ పక్షాన ఉంచుకునేందుకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. తనను వ్యతిరేకించిన వారిని క్షమించే అలవాటు లేని మోదీ, ఒకప్పుడు నితీశ్ తనను తీవ్రంగా వ్యతిరేకించారన్న వాస్తవాన్ని పూర్తిగా విస్మరించడం వెనక బీహార్ ప్రయోజనాలే ముఖ్యమని గుర్తించారని చెప్పకతప్పదు. బిహార్‌లో బీజేపీ ఎదుగుదలకు నితీశ్‌తో పొత్తు తప్పనిసరని ప్రధానమంత్రి గ్రహించారు. మరోమారు బీహార్‌లో ఎన్‌డిఎ విజయం సాధిస్తే.. సమీప భవిష్యత్తులో బిహార్‌లో కూడా ఏక్‌నాథ్ షిండే లాంటి తిరుగుబాటు సంభవించే అవకాశం లేకపోలేదు. అయినా ప్రస్తుతానికి మాత్రం బీజేపీ ఎన్నికల విజయాలకు నితీశ్‌కుమార్ ఆవశ్యకత అమితంగా ఉన్నది. లాలూప్రసాద్ యాదవ్‌తో ఉన్న రాజకీయ అనుబంధాన్ని తెగతెంపులు చేసుకుని నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనత పార్టీతో నితీశ్ జతకట్టంలో ఆయన స్వార్థం కూడా ఉంది. నిరంతరాయంగా బీహార్ సిఎంగా నిలిచిపోవాలన్న ఆయన కాంక్షను కాదనలేం. రాజకీయ సౌలభ్యం కోసమే ఆయన మళ్లీ మోదీతో చేయి కలిపారు. అలాగని బీజేపీకి నితీశ్ కుమార్ పట్ల ప్రత్యేక ప్రేమ ఏమీ లేదు. 2013లో ప్రధానమంత్రి పదవికి అవసరమైన అర్హతలు నరేంద్ర మోదీకి లేనేలేవని తొట్టతొలుత నిరసన తెలిపిన నేత నితీశ్‌కుమార్. ఈ విషయాన్ని బీజేపీ మరచిపోయి ఉండదు. అయితే బిహార్‌లో ఎన్డీఏకు సమర్థంగా నేతృత్వం వహించగల నాయకుడు మరొకరు లేరన్న వాస్తవమూ బీజేపీకి బాగా తెలుసు. నితీశ్‌కు ప్రత్యామ్నాయంగా మరెవ్వరూ లేనందునే బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగనిస్తోంది. వయసు మీదపడడంతో నితీశ్ కుమార్ కూడా తప్పిని పరిస్థితుల్లో మోదీయే సర్వం అయిన ఢిల్లీ దర్బార్‌కు విధేయుడుగా ఉంటూ వస్తున్నారు. అయితే మారుతున్న కలానుగుణంగా బిహార్ ఓటర్లలో అత్యధికులు సైతం మౌలిక మార్పులు కోరుకుంటున్నారు. మరి ప్రశాంత్ కిశోర్ నాయకత్వంలోని జన్ సురాజ్ పార్టీకి వారు ఓటు వేస్తారా అన్న చర్చ కూడా సాగుతోంది. తేజస్వి యాదవ్ కూడా గట్టి పోటీ ఇస్తున్నారు. ఇకపోతే బీహార్ ఓటర్ల సవర్ణ రచ్చ కూడా చర్చకు దారితీస్తోంది. ఎంఐఎం కూడా ముస్లిం డామినేట్ ఉన్న ప్రాంతాల్లో బరిలోకి దిగింది. ఈ క్రమంలో బీహార్ ఎన్నికలు ఎవరికి మొగ్గు చూపుతాయి, ప్రజలు ఆలోచన ఏ విధంగా ఉందన్నది కూడా అంతుచిక్కడం లేదు. ఇప్పటికే బిహార్ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయడంలో నితీశ్ రికార్డు సృష్టించారు. ఇప్పటికి మొత్తం తొమ్మిది సార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనేక పరిమితులు ఉన్నప్పటికీ బిహార్‌కు ఆయన నాయకత్వం తప్పనిసరి అని పలువురు, ముఖ్యంగా బీజేపీ భావిస్తోంది. ఐదు సంవత్సరాల క్రితం కొత్త తరం బిహారీ రాజకీయ నాయకుడు చిరాగ్ పాశ్వాన్‌ను ప్రోత్సహించడం ద్వారా నితీశ్ స్థాయిని తగ్గించేం దుకు బీజేపీ ప్రయత్నించింది. నితీశ్ ప్రాధాన్యాన్ని తగ్గించడం ద్వారా జనతాదళ్ (యునైటెడ్) పార్టీ ఓటర్లను తనవైపు తిప్పుకోవాలన్నది బీజేపీ ఎత్తుగడ. గత శాసనసభ ఎన్నికల్లో జనతాదళ్(యు) కేవలం 43 సీట్లు మాత్రమే కైవసం చేసుకోగా బీజేపీ 74 నియోజక వర్గాలలో జయపతాక నెగురవేసింది. అయినప్పటికీ నితీశ్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించేందుకు బీజేపీ సంకోచించింది. తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేసేందుకు సుముఖత చూపలేదు. నితీశ్ కుమార్ అపరచాణక్యుడు. బీజేపీ ఎత్తుగడలను అర్థం చేసుకు న్నారు. ఆ పార్టీతో పొత్తును కొనసాగించడం ప్రమాదకరమని భావించారు. మహారాష్ట్రలో శివసేనను నిలువు నా చీల్చివేసిన రీతిలో బిహార్‌లో తన పార్టీని బీజేపీ చీల్చకుండా ఉంటుందా అని నితీశ్ ఆలోచించారు. అందుకే బిజెపిని తన దగ్గరే పెట్టుకుని జాగ్రత్తగా ఉంటున్నారు. అయితే ఈసారి ఆయన పదోసారి సిఎంగా బాధ్యతలు స్వీకరిస్తారా లేదా అన్నది చూడాలి. ఈక్రమంలో తేజస్వీ యాదవ్ సిఎం కావడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకు కాంగ్రెస్ ఘట్‌బంధన్ కలసివస్తుందా లేదా అన్నది చూడాలి. అలాగే రాహుల్ ఓట్‌చోరీ ఆరోపణలు ఏమేరకు ఫలితం ఇస్తుందో చూడాలి.



# ఢిల్లీ సమీపంలో భారీగా ఆయుధాల స్వాధీనం

**2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాల స్వాధీనం**

**హర్యానాతో కలసి కాశ్మీర్ పోలీసుల ఆపరేషన్**

**పలువురు ఉగ్రవాదుల అరెస్ట్..వారిలో నలుగురు డాక్టర్లు**

న్యూఢిల్లీ, నవంబర్10**ఆంధ్ర ప్రగతి**
దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో ఉగ్రవాదులకు సంబంధించిన ఆయుధాలు భారీఎత్తున లభ్యమయ్యాయి. హరియాణాలోని ఫరిదాబాద్‌లో 350 కిలోల అమ్మోనియం నైట్రేట్ సంబంధిత పేలుడు పదార్థాలు, ఒక రైఫిల్ సహా 20 టైమర్లను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక పోలీస్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. ఉగ్రనిరోధక చర్యల్లో జమ్మూకశ్మీర్ పోలీసులు భారీ విజయం సాధించారు. హరియాణా పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు చేశారు. నిషేధిత జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్–ఉల్–హింద్ ఉగ్రసంస్థలతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఇందులో ముగ్గురు వైద్యులూ ఉన్నారు. ఈ క్రమంలోనే పెద్దఎత్తున ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం..అక్టోబరు 19న శ్రీనగర్‌లోని బన్‌పొరా నౌగామ్ ప్రాంతంలో పోలీసులు, భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకుని.. జైషే మహమ్మద్ పోస్టర్లు వెలిశాయి. ఈ వ్యవహారంపై ఉపా చట్టంతోపాటు ఆయా చట్టాల కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా.. ఉగ్రవాద భావజాలం కలిగిన విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌తో కూడిన ఓ ఉగ్రవ్యవస్థ వెలుగుచూసింది. ఈ బృందానికి పాకిస్థాన్, ఇతర దేశాల నుంచి పనిచేస్తున్న హ్యాండ్లర్లతో సంబంధాలున్నాయి. సామాజిక, ధార్మిక కార్యక్రమాల ముసుగులో అవసరమైన నిధులు సేకరించారు. వ్యక్తుల్లో తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించి ఉగ్రసంస్థల్లో చేర్పించడం, లాజిస్టిక్స్ ఏర్పాటు, ఆయుధాలు, మందుగుండు సామగ్రితోపాటు ఐఈడీల తయారీకి అవసరమైన పదార్థాల సేకరణలో పాల్గొన్నట్లు గుర్తించాం. ఈ కార్యకలాపాల సమన్వయం కోసం నిందితులు ఎన్‌క్రిప్టెడ్ ఛానెళ్లను ఉపయోగించారని పోలీసు ప్రతినిధి వెల్లడించారు. ఉగ్ర పోస్టర్లు అంటించిన డాక్టర్‌ను విచారిస్తే భారీ ఆయుధ డంప్ వెలుగులోకి.. వచ్చింది. అరెస్టైన వైద్యుల్లో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంకు చెందిన డా.ఆదిల్, పుల్వామాకు చెందిన డా.ముజమ్మిల్ అహ్మద్, లఖ్‌నవూకు చెందిన డా.షాహీన్ ఉన్నారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో డా.ముజమ్మిల్ అహ్మద్ అద్దె నివాసంలో పోలీసులు భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇతడు అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో బోధకుడిగా పనిచేస్తున్నాడు. శ్రీనగర్‌లో జైషే మమహ్మద్ పోస్టర్లు వేసిన కేసులోనూ వాంటెడ్‌గా ఉన్నాడు. ఇతడిని అరెస్టు చేసినట్లు అంతకుముందు ఫరీదాబాద్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. మరోవైపు.. షాహీన్ కారులో ఓ ఏకే–47 రైఫిల్ లభ్యమైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్ లోని ఆయా ప్రాంతాలతోపాటు హరియాణాలోని ఫరీదాబాద్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహారన్‌పుర్‌లో స్థానిక పోలీసులతో కలిసి సోదాలు నిర్వహించాం. ఈ క్రమంలోనే మరికొంతమంది నిందితుల పాత్ర బయటపడింది. వారినీ అరెస్టు చేస్తాం. ఇప్పటివరకు ఓ చైనీస్ స్టార్, బెరెట్టా పిస్టల్స్, ఏకే 56, ఏకే క్రింకోవ్ రైఫిళ్లు, 2,900 కిలోల ఐఈడీ తయారీ పదార్థాలు స్వాధీనం చేసుకున్నాం. నిధులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోందని జమ్మూకశ్మీర్ పోలీసు ప్రతినిధి తెలిపారు. వీటితో పాటు మూడు మ్యాగజైన్లు, పిస్టల్, వాకీటాకీ సెట్‌ను స్వాధీనపరచుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. శ్రీనగర్‌లో అక్టోబర్ 27న
జైష్–ఎ–మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పలు పోస్టర్లు వెలిశాయి. వీటిని కశ్మీర్‌కు చెందిన వైద్యుడు ఆదిల్ అహ్మద్ రాథర్ వేసినట్టు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు పసిగట్టారు. సదరు వ్యక్తి ఉత్తర్ ప్రదేశ్ సహరాన్‌పుర్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యుడిగా సేవలందిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అతణ్ని గతవారం అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. నిందితుడు గతేడాది అక్టోబర్ ముందువరకూ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విధులు నిర్వర్తించాడని, అక్కడ అతని లాకర్‌ను తనిఖీ చేయగా ఒక రైఫిల్ దొరికిందని తెలిపారు. అతను ఇచ్చిన సమాచారం ప్రకారమే ఫరిదాబాద్‌లో ఈ రికవరీ జరిగినట్టు వెల్లడించారు. నిందితుడు రాథర్ చెప్పిన ప్రకారం.. ముజామ్మిల్ షకీల్ అనే మరో డాక్టర్ వద్ద కూడా పేలుడు పదార్థాలు, ఆయుధ సామాగ్రి నిల్వ ఉన్నట్టు తేలింది. దీంతో పుల్వామాకు చెందిన షకీల్‌నూ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడు ఫరిదాబాద్‌లోని అల్–ఫలాహ్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ఓ మహిళా వైద్యురాలి కారులో ఒక రైఫిల్, పిస్టల్ బయటపడ్డాయి. ఆమె మందుగుండు సామాగ్రిని నిల్వచేసేందుకు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్న దర్యాప్తు అధికారులు.. ఆమెపై విచారణ చేపట్టారు.



# జడ్జీలపై ఆరోపణల ట్రెండ్..

## సహించబోం: సీజేఐ గవాయ్ అసహనం

న్యూఢిల్లీ,నవంబర్10**ఆంధ్ర ప్రగతి**
తమకు అనుకూలంగా తీర్పులు రానప్పుడు న్యాయమూర్తులపై తీవ్రమైన, నిరాధార ఆరోపణలు చేసే ధోరణి పెరిగిపోవడంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పద్ధతులను తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఎన్. పెద్ది రాజు అనే వ్యక్తిపై నమోదైన కోర్టు ధిక్కరణ కేసు విచారణ సందర్భంగా సీజేఐ సోమవారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషుమి భట్టాచార్యపై పెద్ది రాజు తీవ్రమైన ఆరోపణలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు సుమోటోగా కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. అయితే, పిటిషనర్ పెద్ది రాజు చెప్పిన క్షమాపణను సదరు న్యాయమూర్తి అంగీకరించారని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే కోర్టుకు తెలిపారు. దీంతో ధర్మాసనం ఈ కేసును మూసివేసింది. అయినప్పటికీ, ఈ ధోరణిపై సీజేఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు."న్యాయస్థానానికి సేవకులుగా ఉండే న్యాయవాదులకు కోర్టు పట్ల ఒక బాధ్యత ఉంటుంది. శిక్షించడంలో కాదు, క్షమాపణ చెప్పినప్పుడు క్షమించడంలోనే చట్టం యొక్క గొప్పతనం ఉంటుంది. ఆరోపణలు ఎదుర్కొన్న హైకోర్టు న్యాయమూర్తే క్షమాపణను అంగీకరించారు కాబట్టి మేము ఈ కేసును ముందుకు తీసుకెళ్లడం లేదు. అయితే, న్యాయమూర్తులపై ఆరోపణలు చేసే పిటిషన్లపై సంతకాలు చేసే ముందు న్యాయవాదులు చాలా జాగ్రత్తగా ఉండాలి" అని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఎస్సీ/ఎస్టీ చట్టం కేసులో హైకోర్టు ఉపశమనం కల్పించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ పెద్ది రాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన బదిలీ పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి పక్షపాతంతో వ్యవహరించారని, అనుచితంగా ప్రవర్తించారని తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై జులైలో తీవ్రంగా స్పందించిన సుప్రీంకోర్టు, పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు నిరాకరించి.. రాజు, అతని న్యాయవాదులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.
ఈ నెల 23న పదవీ విరమణ చేయనున్న సీజేఐ గవాయ్, న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే ఇలాంటి చర్యల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.



# ఏపీలోని ప్రభుత్వ ఆసుపత్రులకు కొత్త వైద్యులు..

## 227 మంది స్పెషలిస్టులకు పోస్టింగ్‌లు

**అమరావతి**, నవంబర్10**ఆంధ్ర ప్రగతి**
రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో స్పెషలిస్ట్ వైద్యుల కొరతను నివారించేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పీజీ విద్యను పూర్తి చేసుకున్న 227 మంది వైద్యులకు రాష్ట్రవ్యాప్తంగా 142 సెకండరీ ఆసుపత్రులలో పోస్టింగ్‌లు ఇచ్చినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ నియామకాలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఇన్‌సర్వీస్ కోటాలో 12 వేర్వేరు విభాగాల్లో పీజీ పూర్తి చేసిన ఈ వైద్యులను కౌన్సెలింగ్ ద్వారా పారదర్శకంగా కేటాయించినట్లు మంత్రి వివరించారు. వీరిలో 33 ఏరియా ఆసుపత్రులలో 60 మంది, ఏడు జిల్లా ఆసుపత్రులలో 10 మంది, రెండు ఎంసీహెచ్ ఆసుపత్రులలో ఇద్దరు స్పెషలిస్టులకు పోస్టింగ్‌లు ఇచ్చారు. అత్యధికంగా గూడూరు ఏరియా ఆసుపత్రికి నలుగురు స్పెషలిస్టులను కేటాయించారు. వీరిలో చిన్నపిల్లల వైద్యుడు, రేడియాలజిస్ట్, చర్మవ్యాధి నిపుణుడు, పాథాలజిస్ట్ ఉన్నారు.నియమితులైన 227 మందిలో గైనకాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో 35 మంది చొప్పున, జనరల్ సర్జరీలో 30 మంది, మత్తు వైద్యులు 26 మంది, చిన్నపిల్లల వైద్య నిపుణులు 25 మంది, ఎముకల వైద్యులు 18 మంది, రేడియాలజిస్టులు 17 మంది, కంటి, ఈఎన్‌టీ వైద్య నిపుణులు కూడా ఉన్నారు. 2022–23లో ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ కోర్సుల్లో చేరిన 257 మంది పీహెచ్‌సీ వైద్యులు ఇటీవల తమ కోర్సులు పూర్తి చేశారు. వారిలో 227 మందిని సెకండరీ ఆసుపత్రులలో నియమించగా, ఖాళీలు లేకపోవడంతో మిగిలిన 30 మందికి డీఎంఈ పరిధిలోని ఆసుపత్రులలో ట్యూటర్లుగా అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు.ఈ నియామకాలతో పాటు త్వరలోనే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు 155 మంది, 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరో 155 మంది స్పెషలిస్ట్ వైద్యులు విధుల్లో చేరతారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ పోస్టింగ్‌లకు సంబంధించిన పూర్తి వివరాలను సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రధర్‌బాబు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డా. పద్మావతి మంత్రికి వివరించారు.



# అందుబాటులోకి కొత్త ఆధార్ యాప్...

న్యూఢిల్లీ, నవంబర్10**ఆంధ్ర ప్రగతి**
భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఆధార్ వినియోగదారుల కోసం మరో కొత్త మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్‌ఫోన్‌లోనే ఆధార్ వివరాలను సురక్షితంగా భద్రపరచుకోవడంతో పాటు, అవసరమైన సమాచారాన్ని సులభంగా పంచుకునేందుకు ఈ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించినట్లు యూఐడీఏఐ తెలిపింది. ఈ కొత్త యాప్‌తో ఇకపై భౌతికంగా ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని, ఇది పూర్తిస్థాయి పేపర్‌లెస్ అనుభవాన్ని అందిస్తుందని పేర్కొంది.ఈ యాప్‌లో పలు ఆకర్షణీయమైన ఫీచర్లను పొందుపరిచారు. ముఖ్యంగా, ఒకే డివైజ్‌లో కుటుంబ సభ్యులందరి ఆధార్ వివరాలను కూడా భద్రపరచుకునే వెసులుబాటు కల్పించారు. వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫేస్ అథెంటికేషన్ ద్వారా లాగిన్ అయ్యే సౌకర్యం కల్పించారు. మన ఆధార్ వివరాలను ఇతరులతో పంచుకోవాల్సి వచ్చినప్పుడు, కేవలం అవసరమైన సమాచారాన్ని మాత్రమే (సెలెక్టివ్ షేరింగ్) పంపే అవకాశం కూడా ఉంది. బయోమెట్రిక్ వివరాలను లాక్ లేదా అన్‌లాక్ చేసుకునే ఆప్షన్, ఆధార్ కార్డు చివరిసారిగా ఎక్కడ ఉపయోగించారో తెలుసుకునే హిస్టరీని చెక్ చేసుకునే సౌకర్యం కూడా ఇందులో ఉన్నాయి.అయితే, ప్రస్తుతం వాడుకలో ఉన్న 'ఎం–ఆధార్' యాప్‌కు ఇది ప్రత్యామ్నాయం కాదని యూఐడీఏఐ స్పష్టం చేసింది. ఎం–ఆధార్‌లో లభించే డిజిటల్ కార్డు డౌన్‌లోడ్, పీవీసీ కార్డు ఆర్డర్, మొబైల్/ఈ–మెయిల్ వెరిఫికేషన్ వంటి సేవలు ఈ కొత్త యాప్‌లో ఉండవు. కేవలం ఆధార్ డేటాను సురక్షితంగా నిల్వ చేయడం, షేర్ చేయడం కోసమే దీనిని తీసుకొచ్చారు.
ఆండ్రాయిడ్ యూజర్లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి, ఐఫోన్ యూజర్లు యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేశాక, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఓటీపీ, ఫేస్ అథెంటికేషన్ పూర్తి చేయాలి. అనంతరం, భద్రత కోసం ఒక పిన్ నంబర్‌ను సెట్ చేసుకుని యాప్‌ను ఉపయోగించడం ప్రారంభించవచ్చు. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సేవలు మరింత సులభంగా, సురక్షితంగా మారతాయని అధికారులు భావిస్తున్నారు.



# 14నుండి టెస్ట్ సిరీస్ ప్రారంభం

**● భారత్- దక్షిణాఫ్రికా మధ్య రెండు టెస్టులు**

**● తిరిగి జట్టులోకి రానున్న రిషబ్ పంత్**



దక్షిణాఫ్రికా జట్టు భారతదేశ పర్యటనకు వస్తోంది. ఈ టూర్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడనున్నారు. దక్షిణాఫ్రికా, భారత్ సిరీస్ శుక్రవారం, నవంబర్ 14 నుంచి ప్రారంభం కానుంది. ఇరు జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ ఈ 14న ప్రారంభం కానుంది. భారత టెస్ట్ జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో గాయం నుంచి కోలుకున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి రానున్నాడు. అంతకుముందు పంత్‌ను దక్షిణాఫ్రికా ఏతో జరిగిన మ్యాచ్‌లో భారత్ ఏ జట్టుకు కెప్టెన్‌గా నియమించారు. పంత్ చేరికతో బ్యాటింగ్ మరింత పటిష్టం కానుంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య టెస్ట్ సిరీస్ నవంబర్ 14న ప్రారంభమై నవంబర్ 26 వరకు జరుగుతుంది. మొదటి టెస్ట్ మ్యాచ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్, రెండో మ్యాచ్ గౌహతిలో జరగనుంది. భారత్- దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ నవంబర్ 14 నుంచి నవంబర్ 18 వరకు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఈ టెస్ట్ మ్యాచ్ ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ టెస్ట్ సిరీస్‌లో రెండో మ్యాచ్ నవంబర్ 22 నుంచి నవంబర్ 26 వరకు గౌహతిలోని బర్సపరా స్టేడియంలో జరుగుతుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఉదయం 9 గంటలకు మొదలవుతుంది. భారత జట్టు ఓపెనింగ్ బాధ్యతలు మరోసారి యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ భుజాలపై పడనున్నాయి. ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్స్ ఇటీవల అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. స్వదేశీ పరిస్థితులలో పరుగులు చేసిన అనుభవాన్ని కలిగి ఉన్నారు. ప్రారంభ ఇన్నింగ్స్ తర్వాత, కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్, వైస్-కెప్టెన్ రిషబ్ పంత్ మిడిల్ ఆర్డర్‌కు స్థిరత్వంతోపాటు, దృఢత్వాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. కోల్‌కతా స్పిన్-ఫ్రెండ్లీ పిచ్‌లను పరిగణనలోకి తీసుకుంటే, ఈ బ్యాటింగ్ లైనప్ బాగా సమతుల్యంగా పరిగణిస్తున్నారు. వీరు ప్రత్యర్థి బౌలర్లకు సవాలుగా మారవచ్చు.

# రోహిత్, కోహ్లీ స్థానాలను భర్తీ చేయవచ్చు

**● ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా**




విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల వన్డే భవిష్యత్తుపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా తీవ్రంగా స్పందించాడు. ప్రస్తుత క్రికెట్‌లో ఎవరి స్థానాన్ని అయినా భర్తీ చేయగల ఆటగాళ్లు ఉన్నారని అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్ ఆడతారా లేదా అనేది అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీకి కూడా పెద్ద సవాలుగా మారింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు బాగా బ్యాటింగ్ చేసి, కుర్రాళ్లకు తాము గట్టిపోటీ ఇస్తామని.. వారితో పోటీపడి పరుగులు సాధించగలమని నిరూపించుకున్నారు. ముఖ్యంగా రోహిత్ శర్మ మంచి టచ్‌లో కనిపించాడు. కోహ్లీ వరుసగా రెండు మ్యాచ్‌లలో డకౌటైనా.. మూడో వన్డేలో కీలక ఇన్నింగ్స్‌తో కమ్ బ్యాక్ చేశాడు. 2 సంవత్సరాల తర్వాత జరిగే ప్రపంచ కప్‌లో ఆడేందుకు వీరి స్థానంపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఒక భారత జర్నలిస్ట్‌తో ఆసీస్ మాజీ కెప్టెన్ స్టీవ్ వా మాట్లాడుతూ, "ఆటగాళ్ళు బాధ్యత తీసుకోవాలి. ఎందుకంటే ఎవరూ ఈ ఆట కంటే పెద్దవారు కాదని అర్థం చేసుకోవాలి. మీరు మిమ్మల్ని ఆట కంటే ఎక్కువ అని భావించకూడదు. ఎవరైనా రోహిత్, కోహ్లీ స్థానాన్ని భర్తీ చేయవచ్చు. ఏ ఆటగాడు కూడా ఆటను తన ఇష్టం వచ్చినట్లు ముందుకు తీసుకెళ్లలేరని నేను నమ్ముతున్నాను. చివరికి, సెలక్షన్ కమిటీ ఛైర్మన్ జట్టు ప్రయోజనాల కోసం నిర్ణయం తీసుకోవాలని" కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ ఆటగాళ్లను ట్రయల్స్‌లో ఉంచలేమని అజిత్ అగార్కర్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే మీడియా నివేదికల ప్రకారం, 2027 ప్రపంచ కప్ కోసం జట్టును ఎంపిక చేయడం కేవలం ప్రదర్శన ఆధారంగానే ఉంటుందని %దీజజ×% అధికారులు చెబుతున్నారు. రోహిత్ శర్మ ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో 202 పరుగులు చేసి రాణించాడు. తన బ్యాటింగ్ ప్రదర్శనకుగానూ రోహిత్ ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు కూడా అందుకున్నాడు. మరోవైపు, విరాట్ కోహ్లీ చివరి వన్డే మ్యాచ్‌లో 74 పరుగులు చేసి ఫామ్‌లోకి వచ్చినట్లు సంకేతాలు ఇచ్చాడు. ఈ ప్రదర్శన ఆధారంగా ప్రపంచ కప్‌లో ఆడేందుకు తాను కూడా రేసులో ఉన్నానని చూపించాడు. స్టీవ్ వా మాట్లాడుతూ.. "అజిత్ అగార్కర్‌తో ఆటగాళ్లకు గుడ్ రిలేషన్ ఉంటుందని నేను ఆశిస్తున్నాను. కానీ అదే సమయంలో ఆటగాళ్లతో తగినంత దూరం పాటించాలి. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో సమన్వయం చేసుకోవడం ముఖ్యమే. కానీ విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ ఏమనుకుంటున్నారు. దేని ఆధారంగా జట్టు ఎంపిక జరుగుతుందనే విషయంపై ముందే క్లారిటీ ఇవ్వడం మంచిది. అనుభవానికి ప్రాధాన్యత ఇస్తారో, లేక ఆ సమయంలో ఫామ్, పరుగులు చేసే తీరును పరిగణనలోకి తీసుకుంటుందో బీసీసీఐ సెలక్షన్ కమిటీ డిసైడ్ చేసుకోవాలి. ప్రతి ఒక్కరిని రీప్లేస్ చేసే సత్తా ఉన్న యువ ఆటగాళ్లు ఉన్నారని గుర్తుంచుకోవాలని" సూచించాడు.

## సన్ రైజర్స్‌లోకి రోహిత్ శర్మ..?




ఐపీఎల్ 2026 సందడి మరికొన్ని రోజుల్లో మొదలుకాబో తుంది. నవంబర్ 15లోపు అన్ని ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను బీసీసీఐకి సమర్పించాలి. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు.. ఇప్పుడు తమ టాప్ ప్లేయర్లను ఎక్స్ఛేంజ్ చేసుకోబోతున్నట్లు వస్తున్న వార్తలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ ఒప్పందం జరిగితే ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత హై ప్రొఫైల్ ట్రేడ్ అవుతుందంటున్నారు క్రీడా నిపుణులు.ముంబై ఇండియన్స్ ప్లేయర్ రోహిత్ శర్మ హైదరాబాద్కు.. బదులుగా స్టార్ బ్యాట్స్‌మన్ ట్రావిస్ హెడ్ ముంబై ఇండియన్స్ కు మారబోతున్నట్లు నెట్టింట్లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటికైతే రెండు ఫ్రాంచైజీలు.. ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన జారీ చేయలేదు. అయితే ఇదంతా 'ఎక్స్'లో ఇండియన్ క్రికెట్ అనే అకౌంట్ నుండి వచ్చిన పోస్ట్‌తో మొదలైంది. రోహిత్ శర్మ ఆధ్వర్యంలో ముంబై ఇండియన్స్ ఐపీఎల్‌లో ఐదుసార్లు టైటిల్స్‌ని గెలుచుకుంది. హిట్‌మ్యాన్ బ్యాటింగ్‌కు వెన్నెముక లాంటివాడు.. తనకున్న అనుభవంతో ఏ జట్టునైనా టాప్‌లో ఉంచుతాడు. రోహిత్ మరియు అభిషేక్ శర్మ కలిసి ఓపెనింగ్ చేస్తే ఐపీఎల్ రికార్డులు బద్దలవుతాయని చాలా మంది క్రికెట్ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ముంబై ఫ్యాన్స్ మాత్రం.. రోహిత్ శర్మ హైదరాబాద్ కి వెళ్తే అది తమకు పెద్ద నష్టమని బాధపడుతున్నారు. అయితే ట్రావిస్ హెడ్ కూడా చాలా దూకుడుగా ఆడగల సమర్థుడు. 2023 ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన హెడ్.. హైదరాబాద్ తరపున కూడా గత సీజన్‌లో బలమైన ప్రదర్శన ఇచ్చాడు. ఇక ఈ ఒప్పందం జరిగితే ట్రావిస్ హెడ్ ముంబై తదుపరి కెప్టెన్ కావొచ్చని కొంతమంది అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ట్రేడ్ చేస్తే రోహిత్ శర్మ అనుభవం, అభిషేక్ శర్మ దూకుడు కలిపి బలమైన ఓపెనింగ్ లైనప్‌ను తయారు చేసుకోవచ్చని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పటికే ఐపీఎల్ అభిమానులు డిసెంబర్ మినీ వేలం మరియు ట్రేడ్ విండో ప్రకటనల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి ఎక్స్ఛేంజ్ పుకార్లు నిజమవుతాయా లేదా కేవలం ఊహలేనా అనేది త్వరలోనే తెలియనుంది. ఐపీఎల్ 2026కి ముందు ఈ డ్రామా అభిమానుల్ని మరింత ఆకట్టుకుంటోంది.

# హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీ వదిలి బ్యాటింగ్, ఫీల్డింగ్‌పై దృష్టి పెట్టాలి

**● మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామి వివాదాస్పద వ్యాఖ్యలు**




భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీలో టీమిండియా చరిత్ర సృష్టించింది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి, తొలిసారిగా ఐసీసీ మహిళా వన్డే వరల్డ్ కప్ 2025 టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయాన్ని యావత్ దేశం సెలబ్రేట్ చేసుకుంటున్న తరుణంలో మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామి చేసిన వ్యాఖ్యలు కొత్త వివాదానికి తెర తీశాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ ఇకపై కెప్టెన్సీ వదిలి తన బ్యాటింగ్, ఫీల్డింగ్‌పై దృష్టి పెట్టాలని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. ఐసీసీ మహిళా వన్డే ప్రపంచ కప్ 2025లో భారత్ విజయం సాధించిన తరువాత దేశమంతా ఆనందంలో మునిగి తేలుతోంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా జట్టును అభినందించారు. ఈ ఉత్సవాల మధ్యే, భారత మాజీ కెప్టెన్ శాంతా రంగస్వామి చేసిన ఒక వ్యాఖ్య సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. హర్మన్‌ప్రీత్ కౌర్ ఇప్పుడు కెప్టెన్సీని వదిలిపెట్టి, తన బ్యాటింగ్‌పై, ఫీల్డింగ్‌పై పూర్తిగా దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈ వ్యాఖ్యలు కొత్త చర్చకు దారి తీశాయి. శాంతా రంగస్వామి వ్యాఖ్యలపై మరో మాజీ భారత కెప్టెన్ అంజుమ్ చోప్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌డిటివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తన అభిప్రాయాన్ని బలంగా వెల్లడించారు. "ప్రతి ప్రపంచ కప్ తరువాత ఇలాంటి వ్యాఖ్యలు రావడం సాధారణమైపోయింది. గత నాలుగైదు టోర్నమెంట్లు చూడండి, జట్టు ఓడిపోయినప్పుడు హర్మన్‌ను తొలగించాలని అంటారు. జట్టు గెలిచినప్పుడు కూడా హర్మన్‌ను తొలగించాలని అంటున్నారు" అని అంజుమ్ చోప్రా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రస్తుతం టీమిండియా విజయాన్ని సెలబ్రేట్ చేసుకునే సమయం ఇది అని, ఇలాంటి మాటలతో ఆటగాళ్ల కష్టాన్ని విస్మరించకూడదని అంజుమ్ అన్నారు. అందుకే, ఈ సమయంలో తాను దీనిపై ఎటువంటి వ్యాఖ్య చేయదల్చుకోలేదని, ఎందుకంటే అది భారత విజయాన్ని పాడుచేస్తుంది అని ఆమె పేర్కొన్నారు. హర్మన్‌ప్రీత్ కౌర్, అంజుమ్ చోప్రా మధ్య కేవలం సహచర క్రీడాకారిణి/సీనియర్ సంబంధం మాత్రమే కాదు, అంతకు మించి బలమైన అనుబంధం ఉంది. ప్రపంచ కప్ గెలిచిన తర్వాత కూడా హర్మన్‌ప్రీత్ తన కెరీర్ తొలి రోజుల్లో అంజుమ్ ఇచ్చిన మద్దతును బహిరంగంగా గుర్తు చేసుకున్నారు. 2007-08లో ముంబైలో జరిగిన ఛాలెంజర్ ట్రోఫీ టోర్నమెంట్‌లో అండర్-19 ప్లేయర్‌గా ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ ఎంత శక్తివంతంగా బంతిని కొట్టగలదో అప్పుడే తాను చూశానని అంజుమ్ గుర్తు చేసుకున్నారు. "అప్పుడే హర్మన్ ఒక ప్రత్యేకమైన ప్రతిభావంతురాలని నేను గ్రహించాను" అని ఆమె అన్నారు. "హర్మన్ మ్యాచ్ విన్నర్ కాదని నేను ఒక్క క్షణం కూడా అనుకోలేదు. అందుకే నేను ఎప్పుడూ చెబుతూనే ఉంటాను, హర్మన్ మా కెప్టెన్ అయి ఉండాలి" అని అంజుమ్ చోప్రా గట్టిగా మద్దతు పలికారు.

# రిటైన్, రిలీజ్ లిస్ట్‌లపై ఫోకస్ పెట్టిన సన్‌రైజర్స్




ఐపీఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తీవ్రంగా నిరాశపర్చింది. వై నాట్ 300 అంటూ భారీ అంచనాలతో బరిలోకి దిగిన ఆరెంజ్ ఆర్మీ కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరకుండానే ఇంటి దారిపట్టింది. తమకే సాధ్యమైన విధ్వంసకర బ్యాటింగ్‌తో ఈ సీజన్‌ను ప్రారంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. అనూహ్యంగా వరుస పరాజయాలతో చతికిలపడింది. చివర్లో పుంజుకొని హ్యాట్రిక్ విజయం సాధించినా టోర్నీలో ముందుడుగు వేయలేకపోయింది. మొత్తం 14 మ్యాచ్‌ల్లో 6 గెలవడంతో పాటు ఓ మ్యాచ్ రద్దవ్వడంతో 13 పాయింట్స్ సొంతం చేసుకొని 6వ స్థానంతో సరిపెట్టుకుంది. మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్, ప్యాట్ కమిన్స్, జీషన్ అన్సారీలు తీవ్రంగా నిరాశపర్చారు. ముఖ్యంగా మహమ్మద్ షమీ, నితీష్ కుమార్ రెడ్డి, జీషన్ అన్సారీల వైఫల్యం సన్‌రైజర్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. డిసెంబర్ చివరి వారంలో ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించిన మినీ వేలం జరగనుంది. నవంబర్ 15లోపు రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాలను ఫ్రాంచైజీలు ప్రకటించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఫ్రాంచైజీలు తమ రిటైన్, రిలీజ్ లిస్ట్‌లపై ఫోకస్ పెట్టాయి. జట్టుకు భారంగా మారిన ఆటగాళ్లను వదులుకునేందుకు సిద్ధమయ్యాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా తమకు భారంగా మారిన ఆటగాళ్లను వదిలేసే ఆటగాళ్లను వదిలేయనుంది. ముఖ్యంగా టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీతో పాటు అభినవ్ మనోహర్, జీషన్ అన్సారీ, రాహుల్ చాహర్, ఆడమ్ జంపాలను సన్‌రైజర్స్ వదులుకునే ఛాన్స్ ఉంది. ఈ ఐదుగురు ఆటగాళ్లు జట్టుకు భారంగా మారారు. రూ. 10 కోట్లు పెట్టిన కొన్న మహమ్మద్ షమీ కనీసం 10 వికెట్లు కూడా తీయలేదు. 9 మ్యాచ్‌లు ఆడి 11.23 ఎకానమీతో 6 వికెట్లు మాత్రమే తీసాడు. రూ. 3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన రాహుల్ చాహర్, రూ. 2.40 కోట్లకు తీసుకున్న ఆడమ్ జంపాలు కూడా జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. ఆడమ్ జంపా ఆరంభంలోనే గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. రెండు మ్యాచ్‌లు ఆడి రెండే వికెట్లు తీసాడు. పేలవ ఫామ్‌తో రాహుల్ చాహర్‌కు తుది జట్టులో ఎక్కువ అవకాశాలు రాలేదు. ఒకే ఒక్క మ్యాచ్ ఆడి ఒకే ఓవర్ బౌలింగ్ చేశాడు. జీషన్ అన్సారీ తన తొలి మ్యాచ్‌లోనే మూడు వికెట్లు తీసి సంచలన ప్రదర్శన కనబర్చినా.. ఆ తర్వాత ఆ జోరు కొనసాగించలేకపోయాడు. రూ.3.20 కోట్లు పెట్టి కొనుగోలు చేసిన అభినవ్ మనోహర్ కూడా తీవ్రంగా నిరాశర్చాడు. 8 మ్యాచ్‌ల్లో 12.20 స్ట్రైక్‌రేట్‌తో 61 పరుగులు చేశాడుసన్‌రైజర్స్ హైదరాబాద్ వదిలేసే ఆటగాళ్ల జాబితా:మహమ్మద్ షమీ(రూ.10 కోట్లు), రాహుల్ చాహర్(రూ.3.20 కోట్లు), ఆడమ్ జంపా(రూ.2.4 కోట్లు), జీషన్ అన్సారీ(రూ.40 లక్షలు), అభినవ్ మనోహర్(రూ.3.20 కోట్లు)సన్‌రైజర్స్ రిటైన్ చేసుకునే జాబితా ఇదే:హెన్రిచ్ క్లాసెన్(రూ. 23 కోట్లు), ప్యాట్ కమిన్స్(రూ. 18 కోట్లు), ట్రావిస్ హెడ్(రూ. 14 కోట్లు), అభిషేక్ శర్మ(రూ.14 కోట్లు), నితీష్ కుమార్ రెడ్డి(రూ.6 కోట్లు), హర్షల్ పటేల్ (రూ. 8 కోట్లు), ఇషాన్ కిషన్ (రూ. 11.25 కోట్లు), సిమర్‌జీత్ సింగ్ (రూ. 1.50 కోట్లు), అథర్వ టైడ్ (రూ.30 లక్షలు), జయదేవ్ ఉనాద్కత్(రూ.1 కోటి), కమిందు మెండీస్(రూ.75 లక్షలు), అనికేత్ వర్మ(రూ.30 లక్షలు), బ్రైడన్ కార్స్(రూ. కోటి), అనికేత్ వర్మ(రూ. 30 లక్షలు), ఇషాన్ మలింగా(రూ. 1.20 కోట్లు), సచిన్ బేబీ (రూ. 30 లక్షలు)

# కోహ్లీలాగా రోహిత్ శర్మ 600 రన్స్ చేయలేదు

**● టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్**



ఐపీఎల్ ప్రారంభానికి ఇంకా నాలుగైదు నెలల సమయం ఉన్నా ఇప్పట్నుంచే చర్చ మొదలైంది. ప్లేయర్ల ట్రేడింగ్, రిటెన్షన్, మినీ వేలం అంటూ సోషల్ మీడియాలో చర్చంతా ఐపీఎల్ గురించే నడుస్తోంది. ఏయే ప్లేయర్లు ట్రేడ్ అవుతారు ఏయే జట్లలో ఎలాంటి మార్పులు ఉంటాయో అనేది పక్కనపెడిదే, తాజాగా టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మపై కీలక కామెంట్స్ చేశాడు.600- 700 పరుగులు కొట్టలేదు!18ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో రోహిత్ శర్మ ఏ సీజన్‌లోనూ 600ం పరుగులు చేయలేదని కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో అన్నాడు. ఐపీఎల్‌లో అతడి కెప్టెన్సీకి, అనుభవానికి మార్కులు ఇవ్వొచ్చు. కానీ, విరాట్ కోహ్లీలాగా బ్యాటర్‌గా మాత్రం పెద్దగా ఇంపాక్ట్ చూపించలేదని అన్నాడు. అయితే ప్రస్తుతం రోహిత్ ఫుల్ ఫిట్‌గా ఉన్నాడని, అందుకే రానున్న సీజన్‌లో మాత్రం రోహిత్ సత్తా చాటడానికే ప్రయత్నిస్తాడని తెలిపాడు.'ఐపీఎల్‌లో రోహిత్ శర్మ ఎప్పుడు కూడా 700- 800 పరుగులు బాదలేదు. అయితే ఐపీఎల్‌లో తన అనుభవానికి, కెప్టెన్సీకి మాత్రం ఫుల్ మార్కులు ఇవ్వొచ్చు. కానీ, విరాట్ లేదా ఇతర బ్యాటర్లతో పోలిస్తే మాత్రం అతడు 600ం రన్స్ చేయలేదు. ఒక సీజన్‌లో కేవలం ఒకట్రెండు మ్యాచ్‌ల్లో రాణించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకుంటాడు. రానున్న ఐపీఎల్ సీజన్ రోహిత్‌కు ఓ పరీక్ష వంటిది. అయితే ఈసారి సత్తా చాటే ఛాన్స్ ఉంది. ఇప్పుడు రోహిత్ పరుగులు సాధించాలన్న ఆకలితో ఉన్నాడు. అందుకు తగ్గట్లే బరువు తగ్గి ఫిట్‌గా కనిపిస్తున్నాడు. ఈసారి పక్కా 600ం రన్స్ చేయాలని భావిస్తుంటాడు' అని కైఫ్ పేర్కొన్నాడు.కాగా, 2008 నుంచి రోహిత్ ప్రతీ ఐపీఎల్ సీజన్‌లో పాల్గొన్నాడు. ఇప్పటిదాకా 267 ఇన్నింగ్స్‌ల్లో 7046 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, 47 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. రోహిత్ 2013లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. ఆ సీజన్‌లో 19 మ్యాచ్‌ల్లో 538 రన్స్ చేశాడు. అతడి ఐపీఎల్ కెరీర్‌లో ఎక్కువ పరుగులు నమోదు చేసింది ఆ సీజన్‌లోనే. ఆ తర్వాత ఎప్పుడు కూడా 500 మార్క్ అందుకోలేదు.అలాగే ముంబయి ఇండియన్స్ జట్టుకు పేసర్ జస్ప్రీత్ బుమ్రానే కీలకం అని అన్నాడు. అతడు లేకపోతే జట్టు ఇబ్బంది పడుతుందని, బుమ్రా లేని లోటు 2025 ఐపీఎల్‌లో స్పష్టంగా కనిపించిందని తెలిపాడు. 'బుమ్రా ఎన్ని మ్యాచ్‌లు ఆడగలడు అనేది ముంబయికి అతిపెద్ద సమస్య. అతడు అన్ని మ్యాచ్‌లు ఆడితే అది వేరు. 2025 చూసినట్లైతే, సీజన్ ఆరంభంలో బుమ్రా లేడు. అప్పుడు జట్టు వరుస ఓటములు ఎదుర్కొంది. అతడు వచ్చిన తర్వాత మాత్రం వరుసగా ఆరేడు మ్యాచ్‌ల్లో నెగ్గింది. తేడా స్పష్టంగా కనిపిస్తుంది. అతడు ముంబయికి అత్యంత కీలకమైన ఆటగాడు' అని కైఫ్ వ్యాఖ్యానించాడు.కాగా, ఈ డిసెంబర్‌లో దిల్లీ వేదికగా మినీ వేలం జరిగే అవకాశం ఉంది.


ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# మీ ఆతిథ్యం అదుర్స్..
## ప్రభాస్‌కు ఇమాన్వీ కితాబు



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆతిథ్యం ఎలా ఉంటుందో అభిమానులు, మూవీ లవర్స్‌కు ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలు ప్రభాస్ ఇంటి భోజనం ఎంత ప్రత్యేకమో పలు సందర్భాల్లో షేర్ చేసుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని స్వీకరించిన వారిలో తాజాగా అతడి కోస్టార్ ఇమాన్వీ కూడా చేరిపోయింది. ప్రభాస్, ఇమాన్వీ కాంబినేషన్‌లో ఫౌజీ సినిమా వస్తోన్న విషయం తెలిసిందే.
ఫౌజీ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. షూటింగ్ బ్రేక్ టైంలో ఇమాన్వీ ప్రభాస్ ఇంట్లో పసందైన భోజనాన్ని రుచి చూసింది. సర్‌ప్రైజింగ్‌గా, సంతోషంగా అనిపించింది.. మీ ఆతిథ్యానికి నా మనస్సు, పొట్ట నిండుగా మారిపోయాయి. ప్రభాస్ గారు మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు.. అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది ఇమాన్వీ. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. హను రాఘవపూడి డైరెక్ట్ చేస్తున్న ఫౌజీ చిత్రంలో శాండల్ వుడ్ భామ, సింగర్ చైత్ర జే అచర్ కీలక పాత్రలో నటిస్తోంది. పీరియాడిక్ యాక్షన్ రొమాంటిక్ డ్రామా వస్తోన్న ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. మేకర్స్ ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో విడుదల చేసేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. మారుతి డైరెక్షన్‌లో రాజాసాబ్ చేస్తున్నాడు. దీంతోపాటు సలార్ 2, కల్కి 2, స్పిరిట్ చిత్రాలు ట్రాక్‌పై ఉన్నాయి.




# రవితేజ కొత్త సినిమా పోస్టర్ ఔట్

మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఆర్76 తెరకెక్కుతున్నసంగతి తెలిసిందే. సుధాకర్ చెరుకూరి భారీగా ఈ సినిమాను ప్లాన్ చేసారు. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమాకి 'భర్త మహాశయులారా' టైటిల్ అనుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే సోమవారం ఈ సినిమా టైటిల్ విడుదల చేయడానికి టైం ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ లోపే టైటిల్ సగం చెప్పి చెప్పకుండా పోస్టర్స్ లీక్ చేసారు. టైటిల్ చూస్తే.. మొత్తానికి 'భర్త మహాశయులారా' టైటిల్నే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. తాజాగా ఓ పాట కోసం ప్రత్యేకమైన సెట్ వేశారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో రూపొందుతున్న అదిరిపోయే డ్యాన్స్ నంబర్ చిత్రీకరిస్తున్నారు. ఎమోషనల్ కథలతో అలరించే దర్శకుడు కిశోర్ తిరుమల ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకుల ఆకట్టుకునేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమాకి సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ ప్రసాద్ మూరెళ్ళ. నేషనల్ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. ఏఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్.

# యువ హీరో శర్వానంద్ తాజా చిత్రం బైకర్




అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటిస్తున్న చిత్రం బైకర్. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీరు బైకర్ స్పీడ్ ఎలా ఉందో చూశారు. ఇక ఇప్పుడు ప్రెప్పీ మెలోడీ టైం వచ్చేసిందంటూ.. ఫస్ట్ సింగిల్ ప్రోమో అప్‌డేట్ లుక్ విడుదల చేశారు. హెల్మెట్ పెట్టుకున్న హీరోయిన్‌తో రొమాంటిక్ మూడ్‌లో ఉన్న శర్వానంద్ స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ పాట ప్రోమోను నవంబర్ 11న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. గిబ్రాన్ మ్యాజికల్ ఆల్బమ్‌ను రెడీ చేస్తున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్.. ఇక్కడ ప్రతీ బైకర్‌కు ఓ కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ.. చావుకు ఎదురెళ్లే కథ.. అంటూ సాగే వాయిస్‌తో ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ బైక్ రేసుతో సాగుతుంది. ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ అంటూ బైక్ రేసింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్దంగా ఉండండి.. అంటూ శర్వానంద్ టీం ఇప్పటికే బైకర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బైకర్‌లో డాక్టర్ రాజశేఖర్ శర్వానంద్ తండ్రి పాత్రలో కనిపించనుండగా బ్రహ్మాజి, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.


## ప్రేమంటే మూవీ నుంచి పెళ్లి షురూ పాట విడుదల




ప్రియదర్శి, ఆనంది జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమంటే' శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్‌మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మించారు. రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. ఈనెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం నుంచి పెళ్లి పాట 'పెళ్లి షురూ'ను హీరోయిన్ శ్రీలీల చేతుల మీదుగా విడుదల చేశారు.వివాహ వేడుకల ఉత్సాహాన్ని, సంబరాన్ని తెలిపేలా ఉన్న ఈ పాటను శ్రీమణి రాశారు. దీపక్ బ్లూ, శ్రేయా ఘోషల్ ఆలపించగా, లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ పాట నూతన జంట భావోద్వేగాలను అందంగా ఆవిష్కరిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: రాఘవేంద్ర తిరుణ్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్ రెడ్డి.

# దుమ్మురేపుతున్న చిరు, చరణ్‌లు

## తండ్రీకొడుకుల పోటాపోటీ పాటల డ్యాన్స్‌లు





ఒకప్పుడు హీరోల మధ్య పోటీ ఉండేది. ఒక హీరో చేసిన కథ, పాట, ÷ట్ హిట్టయితే అలాంటిదే తమ హీరో కూడా చేయాలని అభిమానులు కోరుకునేవారు. అందుకు తగ్గట్టే హీరోలు, దర్శకులు ఆయా సన్నివేశాలను డిజైన్ చేసుకునేవారు. ఇప్పుడు సొంతవారి నుంచే పోటీ ఎదురవుతోంది. అటు చిరంజీవి , ఇటు రామ్‌చరణ్ తమ కొత్త చిత్రాల్లోని పాటలతో సోషల్ మీడియాను ఊపేస్తున్నారు. పోటీ మాట ఎలా ఉన్నా, మెగా అభిమానులు మాత్రం ఆనందంలో తేలియాడుతున్నారు.అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు' . నయనతార కథానాయిక. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర ప్రచారంలో భాగంగా విడుదల చేసిన 'మీసాల పిల్ల సాంగ్ యూత్‌ను విశేషంగా ఆకట్టుకుంటోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం, ఉదిత్ నారాయణ్ గాత్రానికి చిరంజీవి గ్రేస్ తోడవడంతో ఈ పాట ట్రెండ్ అవుతోంది. ఇప్పటికే 50 మిలియన్ వ్యూస్‌తో దూసుకుపోతోంది. సాంగ్‌ను ఎంజాయ్ చేస్తూ డ్యాన్స్ చేయడంలో చిరంజీవి ఆయనకు ఆయనే సాటి. తెరపై ఆ గ్రేస్ చిరులో మాత్రమే చూడగలం. తండ్రి బాటలోనే పయనిస్తూ అదరగొడుతున్నారు రామ్‌చరణ్. ఆయన కథానాయకుడి గా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పెద్ది'. జాన్వీకపూర్ కథానాయిక. ఏఆర్ రెహమాన్ సంగీత దర్శకుడు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ మూవీ నుంచి 'చికిరి.. చికిరి' అంటూ సాగే పాటను విడుదల చేశారు. ఇందులో చరణ్ వేసిన స్టెప్ సోషల్‌మీడియాను ఊపేస్తోంది. చిన్నా, పెద్దా వయసుతో సంబంధం లేకుండా దీన్ని రీక్రియేట్ చేసి, పంచుకుంటున్నారు. అతి తక్కువ సమయంలోనే ఈ పాట 50 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకోవడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది ప్రేక్షకుల ముందుకురానుంది.